గురువు.. పోలీస్

- శ్రీకాకుళంలో టీచర్
- 'తూర్పు' జిల్లా ఎస్పీ
- గురుపూజోత్సవ ప్రత్యేకం

7లో





రాజమండ్రి కార్పొరేషన్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి

గోదావరి వరదలు, భారీ వర్షం..

తస్మాత్ జాగ్రత్త!

- ముందస్తు కార్యాచరణతో సిద్ధంగా ఉండాలి
- ఆక్రమణల వల్ల ముంపు వాటిల్లితే సంబంధిత అధికారిని బాధ్యులను చేస్తా
- వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పి. ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 4: గోదావరి వరదలు పెరుగుతున్నాయి. మరోపక్క భారీ వర్షాలు కురుస్తున్నాయి. అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలి. తస్మాత్‌జాగ్రత్త! అని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి వివిధ విభాగాల అధికారులకు ఆదేశాలు జారీచేశారు. బుధవారం ఉదయం రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయం నుంచి వీడియోకాన్ఫరెన్స్‌ను కలెక్టర్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి జేసీ చిన్నరాముడు, డీఆర్వో జి.నరసింహులు, కేఆర్ఆర్‌సీఎస్ డీసీ ఆర్.కృష్ణనాయక్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గోదావరి వరదలు పెరుగుతున్నాయని, లంకల్లో ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. భారీవర్షాల నేపథ్యంలో ముంపుబారిన పడే ప్రాంతాల్లో చేపట్టాల్సిన జాగ్రత్తల చర్యలపై ముందస్తు కార్యాచరణతో అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. బుధవారం ఉదయం నుంచి రాజమహేంద్రవరం, రూరల్, కడియం, పెరవలి, తాళ్లపూడి మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదైందని, లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు, పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. కమాండ్ కంట్రోల్‌రూంలో సిబ్బంది అందరూ రిపోర్టు చేయాలన్నారు. ఏ ప్రాంతంలోనైనా ఆక్రమణల వల్ల ముంపు వాటిల్లిందని తెలిస్తే సంబంధిత అధికారులనే బాధ్యులుగా చేస్తానని హెచ్చరించారు. గోదావరి పరీవాహక ప్రాంతంలో అత్యధిక వర్షపాతం నమోదైందని, ధవళేశ్వరం వద్దకు భారీగా వరద నీరు చేరే అవకాశం ఉన్న దృష్ట్యా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. రాజమహేంద్రవరం ఆర్డీవో, కొవ్వూరు సబ్‌కలెక్టర్ ప్రత్యేకంగా దృష్టి పెట్టాలన్నారు. సూరంపాలెం, కొవ్వాడ, ఎర్రకాలువ, ధవళేశ్వరం బ్యారేజ్ ప్రాంతాల్లో గండ్లు పడే అవకాశం ఉన్న లోతట్టు ప్రాంతాల్లో ముందస్తు రక్షణా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పునరవాస కేంద్రాలు, ముంపుప్రాంతాలలో నిత్యావసర సరుకుల పంపిణీ ప్రణాళికలో భాగంగా ముందస్తు చర్యల కోసం ఒక నెలకు సరిపడే నిత్యావసరాలు సిద్ధం చేసుకోవడం జరిగిందన్నారు. మత్స్యకారులు వేటకు వెళ్లకుండా నిషేధం విధించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సచివాలయ సిబ్బందికి ఎటువంటి సెలవులు ఇవ్వవద్దని, 24/7 అందుబాటులో ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. ఇప్పటికే డ్రోన్ సర్వే ద్వారా గుర్తించిన ముంపు ప్రాంతాల్లో పరిస్థితులు అంచనా వేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ ఉన్నారు.

అప్రమత్తం



ధవళేశ్వరం బ్యారేజీ చెంతన..



రాజమండ్రిలో గోదావరి ఉధృతి

- ఉధృతంగా పెరిగిన గోదావరి వరద
- ఇటు రాజమహేంద్రవరం, అటు కొవ్వూరు వైపు ఉగ్రరూపం
- కాటన్ బ్యారేజ్ నుంచి 7 లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి
- మరోపక్క భారీ వర్షాలు.. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం
- క్షేత్రస్థాయిలో పర్యటించిన కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే ఆదిరెడ్డి

రాజమహేంద్రవరం (ఆంధ్రజ్యోతి)/సిటీ సెప్టెంబరు 4: గోదావరికి వరద తగిలింది. ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు పడుతుండడంతో గోదావరికి వరదనీరు పెరుగుతోంది. మరోపక్క బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో జిల్లాలో భారీవర్షాలు పడుతున్నాయి. బుధవారం రాత్రి 8 గంటలకు భద్రాచలం నీటి మట్టం 44.40 అడుగులకు చేరింది. సాయంత్రం 43 అడుగులకు చేరగానే మొదటి ప్రమాద హెచ్చరిక జారీచేశారు. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి 7లక్షల 14వేల 614 క్యూసెక్కుల వరద నీటి ప్రవాహం అంబేడ్కర్ కోనసీమ జిల్లా మీదుగా సముద్రంలోకి పోతోంది. బ్యారేజీ నీటిమట్టం 9.60 అడుగులకు చేరింది. ఇది 11.75 అడుగులకు చేరినా, బ్యారేజీ నుంచి 10 లక్షల క్యూసెక్కుల డిశ్చార్జి ఉండాలి. ఈనేపథ్యంలో గురువారం మొదటి వార్నింగ్ వచ్చే అవకాశం లేకపోలేదు. ఇక జిల్లా భారీ వర్షాలు పడుతున్నాయి. మంగళ, బుధవారాల్లో రాజమహేంద్రవరం రూరల్‌లో 108 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పెరవలిలో 101, రాజమహేంద్రవరం అర్బన్‌లో 89.8, కడియంలో 88.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లా అంతటా హోరువాన కురిసింది. నల్లజర్ల మండలంలో మాత్రం కేవలం 5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలో మొత్తం 1028.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకాగా, జిల్లా సగటు వర్షపాతం 54.1 మిల్లీమీటర్లు. జిల్లాలోని మిగిలిన ప్రాంతాల వర్షపాతాలను పరిశీలిస్తే తాళ్లపూడిలో 77.6 మీమీ, గోకవరంలో 70.0 మీమీ, కొవ్వూరులో 66.8 మీమీ, నిడదవోలులో 60.6 మీమీ, ఉండ్రాజవరంలో 59.8 మీమీ, చాగల్లులో 59.6మీమీ, సీతానగరంలో 43.0మీమీ, రాజానగరంలో 40.6 మీమీ, గోపాలపురంలో 37.6 మీమీ, దేవరపల్లిలో 34.6 మీమీ, బిక్కవోలులో 25.6 మీమీ, అనపర్తిలో 24.4 మీమీ, కోరుకొండ 20.4 మీమీ, రంగంపేటలో 15.2 మీమీ.



కొవ్వూరు గోష్పాద క్షేత్రం వద్ద వరద గోదావరి దృశ్యం

ఉరకలేస్తున్న అఖండ గోదారి

కొవ్వూరు, సెప్టెంబరు 4: పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు అఖండ గోదావరికి మరోసారి వరద పోటెత్తింది. ఈ ఏడాది జూలైలో గోదావరికి వరద పోటెత్తి 12 రోజులపాటు తీర ప్రాంత ప్రజలకు కంటి మీద కునుకులేకుండా చేసింది. మళ్లీ ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న అధిక వర్షాలకు గోదావరి నది ఉప్పొంగుతోంది. దీంతో కొవ్వూరు గోష్పాదక్షేత్రం వద్ద ప్రధాన స్నానఘట్టాలను వరద ముంచెత్తింది. స్నానఘట్టాల్లో ఉన్న శివలింగాలు, దేవతామూర్తుల విగ్రహాలు పూర్తిగా నీటమునిగాయి. గోదావరికి వరద పోటెత్తుతున్నందున తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అఖండ గోదావరి కుడి ఏటిగట్టు విభాగం (ఏజీఆర్‌బీ) ఏఈ ఆర్.సునీల్‌బాబు కోరారు. ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొవడానికి వీలుగా అవసరమైన సామగ్రిని సెంట్రల్ ఫ్లడ్ స్టోర్‌లో సిద్ధం చేశామన్నారు. కొవ్వూరు మండలం సీతంపేట (విజ్జేశ్వరం) నుంచి పోలవరం వరకు 40 కిలోమీటర్ల మేర 12 మంది అవుట్ సోర్సింగ్ సిబ్బందితో ఏటిగట్టను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని సునీల్‌బాబు తెలియజేశారు.

రాజమహేంద్రవరంలో లోతట్టు ప్రాంతాలు జలమయం

రాజమహేంద్రవరంలో బుధవారం తెల్లవారుజాము నుంచి కురుస్తున్న వర్షానికి చాలా ప్రాంతాలు జలమయం అయ్యాయి. నగరంలో హైటెక్ బస్టాండ్, కంబాలచెరువు, కోరుకొండ రోడ్డు, లలితానగర్, కృష్ణానగర్, రామచంద్రరావుపేట, వాంబే కాలనీ, ఆదెమ్మదిబ్బ, తుమ్మలోవ, ఆర్యాపురం, రైల్వేస్టేషన్ రోడ్డు, తాడితోట రోడ్డు, ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డు, వీఎల్ పురం సెంటర్ తదితర ప్రాంతాల్లో వర్షపునీరు రోడ్డెక్కింది. రహదారులు కాలువలను తలపించాయి. కంబాల చెరువు పూర్తిగా నిండింది. అదేవిధంగా ఆర్యాపురంలోని ఏబీ నాగేశ్వరరావు పార్కు స్టోరేజీ ట్యాంక్ నిండుకుంది. ఇంకా వర్షాలు పెరిగితే ఆర్యాపురం నుంచి తుమ్మలోవ వరకు, అటు లింగంపేట, మూలగొయ్యిసెంటర్ వరకు, ఇటు శేషయ్య మెట్ట డ్రైన్ ఫైర్‌స్టేషన్ వరకు రహదారులు జలమయం అయ్యే ప్రమాదం ఉంది. ప్రస్తుతం నల్లా చానల్‌లో కూడా మోటార్లు పూర్తి స్థాయిలో లేవు. హైపవర్ లిఫ్ట్ మోటార్లను విజయవాడకు తరలించారు. ప్రస్తుతం సాధారణ మోటార్లతోనే నడిపిస్తుండగా, మరోక హైస్పీడ్ మోటార్‌ను రప్పిస్తున్నారు. దాన్ని అమర్చేలోపు భారీ వర్షం పడితే ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది.



ధవళేశ్వరం సాయిబాబా ఆలయ సమీపంలో ప్రాంతాన్ని కలెక్టర్ పరిశీలిస్తున్న దృశ్యం

క్షేత్ర స్థాయిలో జిల్లా కలెక్టర్ పర్యటన

రాజమహేంద్రవరం రూరల్/సిటీ, సెప్టెంబరు 4: రాజమహేంద్రవరం, రూరల్ ప్రాంతాల్లో భారీ వర్షాల నేపథ్యంలో పలు ప్రాంతాలు ముంపుబారిన పడకుండా చేపట్టే తక్షణ చర్యల్లో భాగంగా బుధవారం కలెక్టర్ పి.ప్రశాంతి క్షేత్రస్థాయిలో పర్యటించారు. ధవళేశ్వరం సాయిబాబా ఆలయం వద్ద డ్రైన్‌తోపాటు రాజమహేంద్రవరంలో పలు ప్రాంతాల్లో సమస్యలను కలెక్టర్ పరిశీలన చేశారు. ఈ సందర్భంగా అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ ఆక్రమణల తొలగింపు పనులు చేపట్టాలని, శానిటేషన్ మెరుగుపర్చాలని ఆదేశించారు. ఆక్రమణల వల్ల ఇబ్బంది ఏర్పడితే సంబంధిత అధికారులే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ముంపు నివారణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆమె వెంట ఎంపీడీవో డి.శ్రీనివాస్, డీఆర్‌డీఏ పీడీ ఎన్‌వీవీఎస్ మూర్తి, ఇన్‌చార్జి తహశీల్దార్ రమ్య పాల్గొన్నారు.



నల్లాచానల్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ నరసింహకిషోర్, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

ముంపు ప్రాంతాలను పరిశీలించిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి, ఎస్పీ నరసింహ కిషోర్



రాజమండ్రి రైల్వే స్టేషన్ రోడ్డు, ఎదురుగా ఉన్న వీధుల్లో నిలిచిన వర్షం నీరు



రాజమండ్రి అర్బన్ తహశీల్దార్ కార్యాలయంలోకి చేరిన వర్షం నీటితో పాట్లు



రామచంద్రరావుపేట సమీపంలో వర్షం నీటిలోనే వెళుతున్న ఓ దివ్యాంగుడు

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 4: రాజమహేంద్రవరంలో ముంపు ప్రాంతాలను సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, ఎస్పీ డి.నరసింహకిషోర్ పరిశీలించారు. గోదావరిలో వరద నీరు పెరగడం, మరోపక్క భారీ వర్షం కురవడంతో వారు అప్రమత్తమయ్యారు. నల్లా చానల్‌లో మోటార్ కండిషన్ పరిశీలించారు. అలాగే రాజీవ్‌గాంధీ కాలనీ, లలితానగర్, ఆర్యాపురం, తుమ్మలోవ, రామచంద్రరావుపేట ప్రాంతాలను పరిశీలించి ముంపు నివారణకు పలు సూచనలు చేశారు. గోదావరి వరదల నేపథ్యంలో లంకల్లో ఉన్న ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించే అంశంపైన చర్చించారు. పునరావాస కేంద్రాల్లో అవసరమైన ఆహారం, సదుపాయాలు కల్పించాలని, భారీ వర్షాలు ఉన్నందున తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. లిఫ్ట్ మోటార్లు కండిషన్‌లో పెట్టుకుని ఎప్పటికప్పుడు వర్షం నీటిని గోదావరిలోకి లిఫ్ట్ చేయాలని ఎమ్మెల్యే సూచించారు. రాబోయే మూడు రోజులు వర్షం కారణంగా నగరంలోని ముంపు ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. పాల ప్యాకెట్లు, కొవ్వొత్తులు, నిత్యావసరాలు, బిస్కెట్లు, అగ్గిపెట్టెలు అందుబాటులో ఉంచుకోవాలని మైక్ ద్వారా ఎమ్మెల్యే ప్రకటింపజేశారు. తాను, ప్రభుత్వాధికారులు అందుబాటులో ఉండడంతోపాటు సహాయ సహకారాలు అందిస్తామని వాసు భరోసా కల్పించారు.

వైద్య, ఆరోగ్యశాఖ ఫ్లడ్ యాక్షన్ ప్లాన్ సిద్ధం

- భారీ వర్షాలు, వరదలు, తుఫాన్లపై అప్రమత్తంగా ఉండండి
- ఎమర్జన్సీ పరిస్థితుల్లో సెలవులు ఇవ్వొద్దు
- డీఎంఅండ్‌హెచ్‌వో తక్షణ ఆదేశాలు

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 4: భారీ వర్షాలు, వరదలు, తుఫాన్లు వంటి ప్రకృతి వైపరీత్యాల నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ముందస్తు ఫ్లడ్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసింది. ఈ మేరకు బుధవారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి (డీఎంఅండ్‌హెచ్‌వో) డాక్టర్ కె.వెంకటేశ్వరరావు జిల్లాలో మెడికల్ ఆఫీసర్లకు పలు ఆదేశాలు జారీచేశారు. వరదలు, తుఫాన్లు సంభవిస్తే వాటి తీవ్రతను తగ్గించేలా, వ్యాధులు ప్రబలకుండా, మరణాలు జరగకుండా చూడాలని ఆదేశించారు. ఆయా ప్రాంతాల్లోని వైద్య బృందాలన్నీ పూర్తి అప్రమత్తంగా ఉండాలని, ఎమర్జన్సీ పరిస్థితుల్లో వైద్య, ఆరోగ్య సిబ్బంది ఎవరికీ సెలవులు ఇవ్వొద్దని ఆయన స్పష్టం చేశారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో 24/7 మెడికల్ క్యాంపులు నిర్వహించాలని, మందులు సిద్ధంగా ఉంచుకోవాలని, క్లోరినేషన్ ప్రక్రియ చేపట్టాలని ఆ సర్క్యులర్‌లో పేర్కొన్నారు. కాగా జిల్లాలో ఆరు గ్రామాల్లో ఇప్పటికే మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నామని, మెడికల్ ఆఫీసర్లకు ఇచ్చిన ఆదేశాలను అమలయ్యేలా సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని ఆయన స్పష్టంచేశారు.

కార్మిక శాఖ నుంచి ఈనెల 30వ తేదీలోపు లైసెన్సు పొందాలి

రాజమహేంద్రవరం, సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని దుకాణాలు, వాణిజ్య వ్యాపార సంస్థలు, మోటారు రవాణా వాహన యాజమాన్యాలు, భవన, ఇతర నిర్మాణ సంస్థలు, కాంట్రాక్టు లేబర్, అంతర్రాష్ట్ర కార్మికులను వినియోగించే కాంట్రాక్టర్లు, ప్రిన్సిపల్ ఎంప్లాయిర్లు కార్మిక చట్టాలను అనుసరించి ఇంటిగ్రేటెడ్ రిజిస్ట్రేషన్ చట్టం కింద రిజిస్ట్రేషను చేసుకొని ధ్రువపత్రం పొందాలని కార్మిక శాఖ అసిస్టెంటు కమిషనర్ టీఎస్ఎం వలి పేర్కొన్నారు. గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన అవగాహన కల్పించారు. అన్ని మీసేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషను, రెన్యూవల్ సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. సెప్టెంబరు 30లోపు కొత్తగా రిజిస్ట్రేషను, రెన్యూవల్ పూర్తి చేసుకోకపోతే చర్యలు ఎదుర్కోక తప్పదన్నారు.

మిర్చి ఘాటు!





- పచ్చిమిర్చి రూ.80 పైనే
- కూరగాయలదీ ఇదే పరిస్థితి
- టమోటా రైతుబజార్లలో కిలో రూ.26, బహిరంగ మార్కెట్లో రూ.60
- బహిరంగ మార్కెట్లో భారీగా పెరుగుదల
- వర్షాల ప్రభావమేనన్న వ్యాపారులు

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 4 : కూరగాయల ధరలు సామాన్యులు, మధ్యతరగతి ప్రజలను భయపెడుతున్నాయి. కేవలం వారం రోజుల్లోనే బహిరంగ మార్కెట్లో కూరగాయల ధరలు భారీగా పెరిగిపోయాయి. పెరిగాయి అనే కంటే చిల్లర వ్యాపారులు ధరలను అమాంతం పెంచేశారు అనడం సబబేమో. ఇదీ, అదీ అని లేదు అన్ని కూరగాయల ధరలు భారీగా పెరిగాయి. సాధారణంగా ధరలు ఎప్పుడూ తక్కువగా ఉండే దొండ, బెండ వంటి కూరగాయలను సైతం బహిరంగ మార్కెట్లలో కిలో రూ.60-రూ.70 చెబుతున్నారు. పావు కిలో అయితే రూ.20లకు తక్కువ ఇవ్వడంలేదు. టమాటా రూ.60పైనే ఉంది. వంకాయలు, చిక్కుళ్లు, బీరకాయలు, పచ్చిమిర్చి వంటివి కిలో రూ.80పైనే చెబుతున్నారు. ఈ ధరలు చూసి సామాన్య మధ్యతరగతి ప్రజానీకం బెంబేలెత్తిపోతున్నారు. కానీ చిత్రంగా రైతుబజార్లలో ధరలు చాలా తక్కువగా ఉండడం గమనార్హం. రైతుబజార్లలో ఒకటి, రెండు మినహా, చాలా రకాల కూరగాయలు తక్కువ రేట్లకే దొరుకుతున్నాయి. దీంతో గత రెండు రోజులుగా రైతుబజార్లకు జనం ఎగబడుతున్నారు. దొరికిన కూరగాయలను దొరికినట్టు రెండు, మూడు కిలోలు కొనుగోలుచేసి తీసుకెళుతున్నారు. మళ్లీ వర్షాలు కురుస్తాయనే వాతావరణశాఖ హెచ్చరికల సమాచారంతో కూరగాయలకు ఇబ్బంది వస్తుందనే ఆలోచన కారణంగా ప్రజలు పెద్దసంఖ్యలో వచ్చి ఎక్కువగా కొనుగోళ్లు చేస్తున్నారని చెబుతున్నారు. దీంతో బుధవారం రైతుబజార్లన్నీ కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ప్రజలు ఎగబడ్డారు.

● వర్షాల బూచి చూపించి..

జిల్లాలో కొద్దిరోజుల కిందట ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిశాయి. గోదావరికి వరద పోటెత్తింది. కూరగాయలు ఎక్కువగా సాగుచేసే సీతానగరం, కడియపులంక, రావులపాలెం, సిద్ధాంతం వంటి ప్రాంతాల్లోని లంకలు కూడా మునిగాయి. దీంతో కూరగాయల పంటలు బాగా దెబ్బతిన్నాయి. లంకల్లో కూరగాయలు సాగుచేసే వారితోపాటు రైతుబజార్లలోని రైతుల పంటలు కూడా వర్షపు దెబ్బతిన్నాయి. ఆ తర్వాత వర్షాలు తగ్గుముఖం పట్టడం, లంకల్లో నీరు లాగడంతో నెమ్మదిగా అన్ని రకాల కూరగాయల దిగుబడి పెరిగింది. బీరకాయలు, ఆనబకాయలు, బెండ, దొండ, వంకాయలు, అరటి, చిక్కుళ్లు వంటి రకాలన్నీ మార్కెట్లకు రావడం ప్రారంభమైంది. దొమ్మేరు వంకాయలు, చిక్కుళ్లు మినహా దాదాపు అన్ని రకాల కూరగాయలు కిలో రూ.50 దాటలేదు. కానీ బహిరంగ మార్కెట్లో చిత్రంగా ధరలు అమాంతం పెరిగిపోయాయి. రైతు బజార్లలో మంచి నాణ్యత కల్గిన టమోటా కిలో రూ.26కు విక్రయిస్తుంటే బహిరంగ మార్కెట్లో రూ.60 చెప్పడం విశేషం. పచ్చిమిర్చి రైతు బజార్లలో కిలో రూ.22 ఉంటే బయటి మార్కెట్లో రూ.80 చెబుతున్నారు. టమోటాలను చిత్తూరు మదనపల్లె, కర్నూలు ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటే, పచ్చిమిర్చి ఒడిశా బరంపురం నుంచి వస్తోంది. కూరగాయలు సమీప గోదావరి లంకలు, ఇతర ప్రాంతాల నుంచి వస్తుంటాయి. బహిరంగ మార్కెట్లలోని వ్యాపారులంతా ప్రధానంగా రావులపాలెం సమీపంలోని మడికి మార్కెట్, రాజమహేంద్రవరంలోని రంభ-ఊర్వశి మార్కెట్ల నుంచి టమోటా, మిర్చి, ఇతర కూరగాయలన్నింటినీ ఖరీదు చేసి ఇక్కడ అమ్ముతుంటారు. బహిరంగ మార్కెట్లలో విక్రయించే వ్యాపారులు, రైతు బజార్లలోని వ్యాపారులు ఇద్దరూ టమోటా, మిర్చిని ఒకే మార్కెట్ల నుంచి కొనుగోలు చేస్తున్నా ధరలో ఇంత భారీ వ్యత్యాసం ఎందుకు ఉందనే ప్రశ్న తలెత్తుతోంది. మళ్లీ వర్షాలు పడితే ఈ మాత్రం కూరగాయలు కూడా దొరికే పరిస్థితి ఉండదని, ధరలు భారీగా పెరుగుతాయని వ్యాపారులు వినియోగదారులతో మైండ్‌గేమ్ ఆడుతుండడం గమనార్హం.

● రైతు బజార్లలో ధరలు ఇలా..

టమోటా గ్రేడ్-1 కిలో రూ.26, గ్రేడ్-2 కిలో రూ.22 ధర ఉంది. వంకాయలు నలుపు (డిస్కో) కిలో రూ.34, తెలుపుచార రూ.30, గులాబి రూ.36, దొమ్మేరు రూ.38కు విక్రయిస్తున్నారు. బెండకాయలు రూ.34, పచ్చిమిర్చి సన్నాలు రూ.22, కాకరకాయ రూ.28, బీరకాయలు రూ.34, క్యారట్ రూ.30, బంగాళాదుంపలు రూ.32, ఆనబకాయ రూ.30, పొట్లకాయ రూ.24, అరటికాయ రూ.7, చిక్కుళ్లు రూ.86, చేమదుంపలు రూ.38, బొబ్బర్లు రూ.34.. ఇలా బుధవారం రైతుబజార్లలో ధరలు ఉన్నాయి. ప్రతి రోజూ ఇవే ధరలు కొనసాగకపోయినా మార్కెట్ రేటును బట్టి ధరల్లో కిలోకు రెండు, మూడు రూపాయలు వ్యత్యాసంతో ధరలు పెరిగే అవకాశం ఉంటుంది. కానీ బహిరంగ మార్కెట్లలో అనూహ్యంగా ధరలు మండిపోవడం సామాన్యులు, మధ్యతరగతి ప్రజల్లో ఆందోళన కల్గిస్తోంది. ఇప్పటికే గత రెండు, మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో సీతానగరం తదితర మండలాల్లో రైతుబజార్లకు చెందిన రైతులు సాగుచేసే బెండ, దొండ, బీర, వంగతోటలు పాక్షికంగా దెబ్బతిన్నట్టు చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో మళ్లీ వర్షాలు పడితే కూరగాయల పంటల సాగుపైనా, దిగుబడులపైనా తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది. జిల్లా అధికార యంత్రాంగం, మార్కెటింగ్ అధికారులు ధరలపై దృష్టిసారించాల్సి ఉంది.



కంసాలిపాలెం-మాధవరం మధ్య ఉధృతంగా ప్రవహిస్తున్న ఎర్రకాల్వ నీరు

తూర్పు - పశ్చిమగోదావరి జిల్లాలకు రాకపోకలు బంద్

నిడదవోలు, సెప్టెంబరు 4: వారంరోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు, ఎర్రకాల్వ నీరు ఉధృతంగా ప్రవహిస్తున్న కారణంగా తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మండలం కంసాలిపాలెం పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం మాధవరం మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఈ మార్గంలో ప్రతినిత్యం రైతులు విద్యార్థులు ఉద్యోగులు రాకపోకలు సాగిస్తుంటారు. నిడదవోలు మండలంలో నుంచి తాడేపల్లిగూడెంలోకి వెళ్లేందుకు ఇది దగ్గర దారికావడమే కారణం.కొద్దిరోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఎర్రకాల్వలోకి వర్షపు నీరు వచ్చి చేరడంతో రెండు జిల్లాల మధ్య రాకపోకలను పంచాయతీ అధికారులు నిలిపివేశారు. ఒక ఫ్లెక్సీని ఏర్పాటుచేశారు.

ఎన్టీఆర్ జిల్లాకు 'తూర్పు' దాతృత్వం

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 4: ఎన్టీఆర్ జిల్లా విజయవాడ, పరిసర ప్రాంతాల్లో వరద బారినపడిన ప్రజలకు తూర్పుగోదావరి జిల్లా ప్రజలు అండగా నిలుస్తున్నారు. గత మూడు రోజులుగా జిల్లా నుంచి పెద్ద ఎత్తున ఆహారం పదార్థాలు, బిస్కెట్ ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లను పంపించి తమ ఉదారతను చాటుకుంటున్నారు. జిల్లా పక్షాన కలెక్టర్ పి.ప్రశాంతి మూడు రోజులుగా సహాయం పంపిస్తున్నారు. బుధవారం తెల్లవారుజామున 40వేల మందికి అల్పాహారం ప్యాకెట్లు సిద్ధం చేయించి పంపించారు. వివిధ అసోసియేషన్లు, కాంట్రాక్టర్లు, కంపెనీలు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధుల దాతృత్వంతో సమకూర్చిన ఆహార పదార్థాలను ప్యాక్ చేయించి 18 వాహనాల్లో విజయవాడ తరలించారు. 40 వేల అల్పాహార ప్యాకెట్లు, లక్ష బిస్కెట్ ప్యాకెట్లు, 1,94,300 వాటర్ ప్యాకెట్లు పంపించారు. తెల్లవారుజామున 2గంటలకు సిద్ధం చేసి విజయవాడకు ఉదయం 5:15 గంటలకు చేర్చారు. అలాగే రాజమహేంద్రవరంలో ఈనెల 2,3 తేదీల్లో అల్పాహారం భోజనాలు కలిపి 2,34,013 ప్యాకెట్లు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పర్యవేక్షణలో పంపించారు. మరోవైపు రాజమహేంద్రవరానికి చెందిన టీడీపీ రాష్ట్ర శెట్టిబలిజ సాధికార సమితి కన్వీనర్ కుడుపూడి సత్తిబాబు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మజ్జి రాంబాబులు విజయవాడ వెస్ట్ నియోజకవర్గంలో పర్యటించి 50 మంది కార్యకర్తలతో బాధితులకు ఆహారం ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లను అందిస్తున్నారు.



గురువు... పోలీస్

- శ్రీకాకుళం జిల్లాలో టీచర్‌గా కెరీర్ ప్రారంభం
- ప్రస్తుతం 'తూర్పు గోదావరి జిల్లా ఎస్పీగా విధులు
- సమాజానికి మరింత సేవ చేయాలని సివిల్స్‌కి
- గురుపూజోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి'తో నరసింహ కిషోర్ మాటామంతీ

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)



బ్లాక్ బోర్డు, చాక్‌పీస్‌తో ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించి తర్వాత పట్టుదలతో ఉన్నత స్థాయికి చేరిన వాళ్లు చాలా మంది ఉన్నారు. ఇంటర్వ్యూ వరకు వెళ్లి వెనక్కి వచ్చేశామని, కోచింగ్ లేదని ఇలా రకరకాల కారణాలకు తలొగ్గకుండా విజయం సాధించారు. పరిశ్రమ, లక్ష్య సాధనే వారిని అంతటి వారిని చేస్తోంది. అలా ఉపాధ్యాయుడిగా కెరీర్‌లో అడుగుపెట్టి నేడు తూర్పు గోదావరి జిల్లా పోలీసులకు బాస్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు దూసి నరసింహ కిషోర్. జిల్లాకు వచ్చిన కొద్ది రోజుల్లోనే అటు ప్రజల్లో... ఇటు సిబ్బందిలో మంచి పేరు సంపాదించుకున్న ఆయన గురువారం గురు పూజోత్సవం సందర్భంగా పలు విషయాలను 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు.

ఆంధ్రజ్యోతి: మీ విద్యాభ్యాసం ఎక్కడ సాగింది?

ఎస్పీ: ఒకటి నుంచి ఏడో తరగతి వరకు ఒడిశా బోర్డురులోని మఠం సరియాపల్లి అనే మారుమూల పాఠశాలలో జరిగింది. ఎస్ఎం పురంలో 10 వరకు చదివాను. డిగ్రీ శ్రీకాకుళంలో పూర్తి చేశాను.

అధ్యాపక వృత్తిని ఎంచుకోవడం?

1993లో డిగ్రీ పూర్తయింది. తర్వాత బీఎస్ఆర్‌బీ, ఎస్ఎస్‌సీ, పీవో... ఇలా రకరకాల పోటీ పరీక్షలు రాశాను. ఏడుసార్లు ఇంటర్వ్యూ వరకూ వెళ్లినా ఫలితం లేకపోయింది. ఈ క్రమంలో 1995లో బీఈడీ పూర్తిచేసి 1996లో ఉపాధ్యాయ పోటీ పరీక్షలో విజయం సాధించాను. శ్రీకాకుళం జిల్లా పాత కొంకాం అనే మారుమూల పల్లెలో తొలి పోస్టింగ్.

యూనిఫాం సర్వీసు వైపు రావడానికి కారణం?

మా నాన్న గారు ధర్మారావు టీచర్. ఆయనకు మంచి రచయితగా, పెద్ద మనిషిగా పేరుంది. మాది శ్రీకాకుళం అయినా రోజూ ఆయనతోనే స్కూలుకు వెళ్లి రావడం జరిగేది. పదో తరగతి వరకు అలా ట్రావెల్ చేశాను. సోషల్ వర్కర్ కూడా. చదువు, సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీట వేసేవారు. ఆయన ప్రభావం నాపై ఎక్కువగా ఉండేది. దీంతో సివిల్స్‌కి వెళితే సమాజానికి మరింత మేలు చేయవచ్చనే ఆలోచన కలిగింది. మా ఇల్లే ఓ లైబ్రరీ. అందువల్ల వేరే కోచింగ్ తీసుకోలేదు. 2003లో గ్రూప్-1 రాశాను. 2006లో నర్సీపట్నంలో డీఎస్పీగా తొలి పోస్టింగ్. 2017లో నాన్-క్యాడర్ ఎస్పీ తర్వాత.. 2022లో ఐపీఎస్ వచ్చింది.

బోధనలో అప్పటికీ ఇప్పటికీ తేడా ఏమిటి?

విద్యార్థులు చాలా అప్‌డేట్ అయ్యారు. దానిని టీచర్లు అందుకోవాల్సిన అవసరం ఉంది. అప్పటి పిల్లలు టీచర్ చెప్పిందే లోకం అనుకునేవారు. కానీ మారిన పరిస్థితుల్లో ప్రశ్నించే స్థాయికి చేరుకున్నారు. దానిని మనం స్వాగతించాలి. వారితో స్నేహపూర్వకంగా మెలగాలి. ఇప్పటి పిల్లలపై సోషల్ మీడియా, సెల్‌ఫోన్ వంటి వాటి ప్రభావం ఎక్కువగా ఉంది. విద్యార్థికి కావాల్సింది క్లాస్‌రూంలో దొరకట్లేదని అనిపిస్తోంది. నైపుణ్యం అవసరమే అయినా సృజనాత్మకత వైపు విద్యార్థులను ప్రోత్సహించాలి.

విద్యార్థి వృద్ధిలో టీచర్, తల్లిదండ్రుల పాత్ర చెప్తారా?

విద్యార్థి నడవడిక (క్యారెక్టర్), పద్ధతి వంటివి ఇంటి నుంచే మొదలవ్వాలి. విద్యార్థి వద్ద పాఠశాలను, టీచర్లను చులకనగా మాట్లాడడం చేయకూడదు. విద్యార్థి ఎలాంటి సమస్యలనైనా తట్టుకునే విధంగా టీచర్ ధైర్యం నింపాలి. సృజనాత్మకతను వెలికితీసి పదునుపెట్టాలి. ప్రతి విద్యార్థిలోనూ ప్రత్యేకమైన ప్రతిభ ఉంటుంది. దానిని ఒడిసి పట్టుకుని సానబట్టాలి.

టీచర్ నుంచి దండన దూరం కావడం మంచిదేనా?

అప్పుడైనా ఇప్పుడైనా విద్యార్థులను కొట్టడం సరికాదు. వారి మనసులో ఒకటి ఉంటుంది. మనం ఒకటి చెబుతూ ఉంటాం. అక్కడే ఘర్షణ ప్రారంభమవుతుంది. పిల్లల తల్లిదండ్రులతో కూడా టీచర్లు మాట్లాడుతూ ఉండాలి. అప్పుడు ఈయన తప్పని పరిస్థితుల్లో ఒక దెబ్బ వేసినా తల్లిదండ్రులు అర్థం చేసుకుంటారు. టీచర్‌కి, విద్యార్థికి మధ్య శత్రుత్వం ఉండదు కదా. ఓ విద్యార్థికి, ఉపాధ్యాయుడికి ఉన్న బంధం ఎన్నటికీ కొనసాగుతూనే ఉంటుంది.

టీచర్లకు, సమాజానికి మీరిచ్చే సందేశం?

మానవ అవతారంలో ఉన్న దేవుడు రాముడికి జ్ఞానబోధ చేసిన అగస్త్యుడిని ఆది గురువుగా చెప్తుంటారు. తర్వాత శ్రీకృష్ణుడు జగద్గురువుగా వినుతికెక్కాడు. చెడు మార్గంపైవు వెళ్లకుండా జీవితాన్ని పసితనం నుంచే ఉన్నతం వైపు చేయిపట్టి నడిపించేవాడే గురువు. అలాంటి గురువుకి సమాజం తగిన గౌరవం ఇవ్వాలి. పిల్లాడి వృద్ధిపై తప్ప వేరే విధంగా వ్యక్తిగత కక్షలు టీచర్లకి ఎందుకుంటాయి?. ప్రతి విద్యార్థీ వృద్ధి చెంది, మంచి పేరు తెచ్చుకోవాలనే తాపత్రయం ప్రతి టీచర్‌లోనూ ఉంటుంది. దీనిని అర్థం చేసుకోవాలి. సమాజంలో అంతర్లీనంగా అతి ఎక్కువగా కలిసిపోయే ఉద్యోగం టీచర్, పోస్ట్‌మ్యాన్ మాత్రమే.

టీచర్, పోలీస్.. ఏది సంతృప్తినిచ్చింది?

టీచర్, పోలీస్.. రెండూ సమాజ సేవకు అంకితమయ్యేవే. దేనికదే ప్రాధాన్యం కలిగిన వృత్తి. ఇప్పటికీ నేను పని చేసిన స్కూల్స్‌కి వెళ్తుంటాను. ఆ ఊళ్లలో వారు మన మాస్టారు వచ్చార్రా.. అంటూ ఆప్యాయంగా పలకరిస్తారు. ఒకప్పటి నా విద్యార్థులు ఇప్పుడు ఇంజనీర్లుగా, డాక్టర్లుగా ఉన్నారు. పోలీస్‌గా కూడా ఎంతో మంది బాధితులకు న్యాయం చేశాను. ఇంకా చేయాల్సింది చాలా ఉంది. ఈ రోజు అయిపోయింది. రేపు కొత్తగా ఎలాంటి అహంభావాలు, భేషజాలు లేకుండా సమాజానికి మేలు చేస్తూ గడిచిపోవాలి.

థాంక్యూ... మళ్లీ కాసేపు పాత రోజులకు తీసుకెళ్లారు. మనసుకు ఏదో తెలియని హాయినిచ్చింది అంటూ ముగించారు



ఉపాధ్యాయ సహచరులతో ఆత్మీయ కలయికలో ఎస్పీ నరసింహ కిషోర్ (పాత చిత్రం)

గురువే దైవం

భగవంతుడు ఆగ్రహిస్తే గురువును ఆశ్రయించి అనుగ్రహాన్ని పొందవచ్చు. అదే గురువు ఆగ్రహిస్తే అనుగ్రహించే భగవంతుడే ఉండడని శాస్త్ర వచనం. అందుకే గురువు ఎక్కువా.. భగవంతుడు ఎక్కువా.. అనే మీమాంస వచ్చినప్పుడు గురువే ఎక్కువని చెప్తారు. ఎందుకో తెలుసా.. భగవంతుడిని చూడాలనే జ్ఞానాన్ని నేర్పించేది గురువే కనుక. గురువు అనుగ్రహం లేకుండా ఎవరూ జీవిత లక్ష్యాలను సాధించలేరు. తల్లి, తండ్రి, గురువు, అతిథి... ఈ నలుగురూ ప్రత్యక్ష గురువులు.

అమలాపురం రూరల్, సెప్టెంబరు 4: అక్షరానికి అంకురారోహణ చేసే తరగతి గది ఒక అద్భుత ప్రయోగ శాల. సమాజాన్ని నిర్మించడంలో, నైతిక విలువలు కాపాడడంలో ఉపాధ్యాయుడి పాత్ర కీలకం. ప్రపంచంలో నానాటికీ పెరిగిపోతున్న పోటీతత్వంవల్లో, ఆధునిక పోకడల గ్రహింపు కొరవడడంవల్లో, ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలు పెరిగిపోవడంవల్లో గురువులు తమపై ఉన్న బాధ్యతను ఒకింత పక్కన పెట్టి విద్యార్థులను బట్టీ పట్టే మరమనుషులుగా తయారు చేస్తున్నారు. చదువులను యాంత్రిక ప్రక్రియగా మార్చేస్తున్నారు. పుస్తకాల్లోని పాఠాలు చెప్పడంతోనే ఉపాధ్యాయుల బాధ్యత తీరిపోదని గ్రహించాలి. సమాజం పట్ల బాధ్యత కలిగిన విద్యావంతులను ఆధునిక గురుబ్రహ్మలు తయారుచేయాలి. సామాజిక అవగాహన లేని చదువు ప్రయోజకత్వాన్ని చేకూర్చదు. విజ్ఞానంతో పాటు సమస్యల పరిష్కారం, సమాజం పట్ల బాధ్యత పెంచేలా చదువులు ఉండాలి. ఏ చదువైనా పిల్లలకు మానసికంగా ఎదగడం నేర్పాలి. చదివిన కొద్దీ జ్ఞానం పెరుగుతుంది. ఒకప్పటి గురుకులాలు నేటి సంక్షేమ వసతిగృహాలు వంటివే. గతంలో అన్ని వర్గాల పిల్లలకు ఒకే తరహా పాఠశాలల్లో నాణ్యమైన విద్యను గురువులు బోధించేవారు. పిల్లల బాగోగులను తల్లిదండ్రుల కన్నా గొప్పగా బడిలో ఉపాధ్యాయులే చూస్తారనడంలో ఎంతమాత్రం అతిశయోక్తి లేదు. నవసమాజ నిర్మాతలను తయారు చేయగల శక్తి ఉపాధ్యాయులకు మాత్రమే ఉంది. గురువును మించిన పూజనీయుడు, ఉద్ధారకుడు ఎక్కడా కనిపించడు. ప్రతి వ్యక్తికీ పూజనీయులుగా తల్లి, తండ్రి, గురువు, దైవం నిలుస్తారు. అయితే ఒక్క గురువులోనే ఈ నాలుగు అంశాలు మనకు కనిపిస్తాయి. గురువు కన్నతల్లిలా లాలించి బుజ్జగిస్తాడు. కన్నతండ్రిలా మంచిచెడ్డలు గమనిస్తూ అభివృద్ధికి పాటుపడతాడు. దేవుడిలా ఆశీర్వదిస్తూ దిశానిర్దేశం చేస్తుంటాడు. శిష్యుడిలోని అజ్ఞానాంధకారాన్ని తొలగిస్తాడు. ఈ నాలుగు పాత్రలు పోషిస్తున్న గురువు ప్రతి వ్యక్తికీ నిజమైన ఆత్మబంధువు.



అమలాపురం రూరల్ పాలగుమ్మి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చిత్రలేఖన ఉపాధ్యాయుడు పోలిశెట్టి నరసింహ చంద్రకుమార్ వాటర్ కలర్స్ ఉపయోగించి గీసిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రం

రాష్ట్రపతి నుంచి అవార్డు అందుకోవడం మరువలేను

మోటూరి భైరవస్వామి
జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత



రాష్ట్రపతి నుంచి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకునే వారు కొందరే. అటువంటి వారిలో నాకూ చోటు లభించడం ఎన్నటికీ మర్చిపోలేను. 1985-86 సంవత్సరంలో అప్పటి రాష్ట్రపతి జ్ఞానీ జైల్‌సింగ్ నుంచి జాతీయ అవార్డు అందుకున్నాను. అంతకు ముందు వరుసగా మూడేళ్లు రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నాను. ఢిల్లీలో రాష్ట్రపతి భవన్‌లో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయులందరినీ ప్రత్యేక అతిథులుగా గుర్తించిన తీరు నేటికీ మరిచిపోను. రాష్ట్రపతి భవన్‌లో 132 గదులు ఉంటే మూడు మినహా అన్నిటినీ చూపించారు. రాష్ట్రపతితో కలిసి విందు భోజనం చేయడం ఎంతో అదృష్టం. ఆనాడు అసలు సిసలు సిల్వర్ మెడల్‌తో పాటు రూ.2,500 నగదు పారితోషికం, ప్రశంసాపత్రం అందించారు.

నైతిక విలువలు పెంపొందించాలి

కేకేవీ నాయుడు, విశ్రాంత ఉపాధ్యాయుడు



అప్పటికీ, ఇప్పటికీ ఉపాధ్యాయుల విద్యా బోధనలో ఎన్నో మార్పులొచ్చాయి. ఆ రోజుల్లో నైతిక విలువలు బోధించేందుకు ప్రత్యేక పీరియడ్లు ఉండేవి. ఇప్పుడా పరిస్థితి లేదు. నైతిక విలువలు పెంపొందించకపోవడం వల్లే సమాజంలో నేడు కనిపిస్తున్న అశాంతికి కారణమవుతోంది. తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను గౌరవించే సంప్రదాయం పాఠశాల తరగతి గదుల నుంచే ప్రారంభం కావాలి.

నిత్య విద్యార్థిగా మెలిగితేనే సత్ఫలితాలు

మంగళంపల్లి అరుణ్‌కుమార్, ఎంబీఏ కళాశాల ప్రిన్సిపాల్



ఉపాధ్యాయులు ఎప్పటికీ నిత్య విద్యార్థులుగానే ఉండాలి. అప్పుడే విద్యోన్నతిలో భాగంగా ఎప్పటికప్పుడు మార్పులకు అనుగుణంగా విద్యా బోధన సాగించగలుగుతారు. తరగతి గదుల్లో పాఠ్యాంశాలకు మాత్రమే పరిమితం కాకుండా సమాజం పట్ల బాధ్యత, నిబద్ధత పెంపొందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉంది. సమాజంలో గురువుల పట్ల గౌరవం ఏమాత్రం సడలలేదు.



వేలి గోటిపై 'సర్వేపల్లి' చిత్రం

ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం నరసాపురపుపేట జడ్పీ ఉన్నత పాఠశాల చిత్రలేఖన ఉపాధ్యాయుడు రాయుడు త్రినాథ్ ప్రసాద్ బొటన వేలి గోటిపై సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రం వేశాడు. ఒకటిన్నర సెంటిమీటర్లో మైక్రో ఆర్ట్ ద్వారా దీనిని తీర్చిదిద్దాడు. - ద్రాక్షారామ

సగ్గు బియ్యం, గోధుమలతో రాధాకృష్ణన్ చిత్రపటం

ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని తూర్పు గోదావరి జిల్లా నిడదవోలుకు చెందిన విద్యార్థి కుంచాల తపస్విరెడ్డి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటాన్ని వినూత్నంగా రూపొందించాడు. అర కిలో సగ్గు బియ్యం, పావు కిలో గోధుమలతో మూడు గంటల పాటు శ్రమించి రాధాకృష్ణన్ చిత్రపటాన్ని తీర్చిదిద్దాడు. దీనిని తిలకించిన ఉపాధ్యాయులు, పట్టణ ప్రముఖులు తపస్విరెడ్డిని అభినందించారు.

- నిడదవోలు





వరద బాధితులకు రూ.కోటి విరాళం

కృష్ణా జిల్లా వరద బాధితులకు ఆపన్నహస్తం అందించేందుకు ముందుకొచ్చారు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ఏడిదకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త, బీఎస్ఆర్ ఇన్‌ఫ్రా అధినేత బలుసు శ్రీనివాసరావు. బుధవారం ఆయన అమరావతిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుని కలిసి రూ.కోటి విరాళం చెక్కు అందజేశారు.

- మండపేట



ప్రత్యేక అలంకరణలో శ్రీపాదశ్రీవల్లభుడు, దత్తాత్రేయస్వామి, నృసింహ సరస్వతి

శ్రీపాద శ్రీవల్లభులకు సహస్ర లిల్లీ పుష్ప పూజ

పిఠాపురం, సెప్టెంబరు 4: కాకినాడ జిల్లా పిఠాపురంలోని శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానంలో జరుగుతున్న శ్రీపాద జయంతి సప్తాహ మహోత్సవాలు బుధవారం నాలుగో రోజుకు చేరుకున్నాయి. శ్రీపాద శ్రీవల్లభులకు సహస్ర లిల్లీ పుష్పాల పూజ నిర్వహించారు. శ్రీపాద శ్రీవల్లభుని పాదపద్మములకు మహన్యాసపూర్వక శతరుద్రాభిషేకం, శ్రీసూక్త, పురుషసూక్తాలతో సహస్ర నామార్చన, రుత్విక్కులతో మూల మంత్ర అనుష్ఠానం జరిగాయి. సాయంత్రం పల్లకి సేవ జరిగింది. కార్యనిర్వహణాధికారి సౌజన్య, భక్తులు పాల్గొన్నారు.





1. ముసలారావును కలెక్టర్ కారులో తరలిస్తున్న దృశ్యం 2. ప్రత్తిపాడు ఆసుపత్రిలోకి తీసుకెళ్తూ 3. విగతజీవిగా...

ధర్మవరం వద్ద మోటారు సైకిళ్లు ఢీ

క్షతగాత్రులను ప్రొటోకాల్ వాహనంలో ఆసుపత్రికి తరలించిన కలెక్టర్ షన్ మోహన్

చికిత్స పొందుతూ ఆర్ఎంపీ వైద్యుడి మృతి, మరో వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రత్తిపాడు, సెప్టెంబరు 4: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరం వినాయకుని గుడి కూడలి వద్ద బుధవారం రెండు మోటారు సైకిళ్లు ఢీకొన్న ఘటనలో ఆర్ఎంపీ వైద్యుడు మృతి చెందగా మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రులను కలెక్టర్ షన్ మోహన్ తన ప్రొటోకాల్ కారులో ప్రత్తిపాడు ఆసుపత్రికి తరలించారు. గొల్లప్రోలు మండలం చెందుర్తికి చెందిన ఆర్ఎంపీ సిద్దాంతపు ముసలారావు సలారావు (52) మోటారు సైకిలుపై ప్రత్తిపాడు మండలం ధర్మవరం బయల్దేరి వెళ్లాడు. అదే గ్రామం నుంచి గొల్లప్రోలుకు చెందిన పొన్నాడ హరిగంగాధర్ స్నేహితుడు బాబితో కలిసి రాజానగరం బయల్దేరాడు. ముందుగా వన్నెపూడి నుంచి ధర్మవరం వైపు వస్తున్న ముసలారావు ధర్మవరం వినాయకుడి గుడి కూడలి వద్ద మలుపు తిరుగుతుండగా వెనుక నుంచి వేగంగా వస్తున్న హరిగంగాధర్, బాబి మోటారు సైకిలు ఢీకొంది.



ముసలారావు (పాత చిత్రం)

ముసలారావు, హరిగంగాధర్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. అదే సమయంలో ఏలేశ్వరంలో ఏలేరు రిజర్వాయరును పరిశీలించి కాకినాడ వెళ్తున్న కలెక్టర్ షన్ మోహన్ తన ప్రొటోకాల్ వాహనాన్ని ఆపి అందులో క్షతగాత్రులద్దరినీ ఎక్కించి ప్రత్తిపాడు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ముసలారావు మృతి చెందాడు. ఆర్ఎంపీ కుటుంబీకులు ఆసుపత్రి వద్ద కన్నీరుమున్నీరయ్యారు. తమ కుటుంబానికి దిక్కెవరు అంటూ ముసలారావు ముగ్గురు కుమార్తెల రోదనలు చూపరులను కంటతడి పెట్టించాయి. ప్రత్తిపాడు తహసీల్దారు సూర్యప్రభ ఆసుపత్రికి వచ్చి మృతుడి కుమార్తెలను పరామర్శించి ఓదార్చారు. సంఘటనాస్థలాన్ని సీఐ బి.సూర్యఅప్పారావు, ఎస్ఐ ఎం.పవన్‌కుమార్ పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



సంఘటనా స్థలంలో నవీన్ మృతదేహం

ఆగి ఉన్న లారీని ఢీకొని యువకుడి మృతి

గండేపల్లి, సెప్టెంబరు 4: కాకినాడ జిల్లా గండేపల్లి మండలంలో జెడ్.రాగంపేట గ్రామ శివారులోని పెట్రోలు బంకు ఎదురుగా రాజమహేంద్రవరం నుంచి తుని వైపు వెళ్లే మార్గం ట్యాంకరు ఆగి ఉంది. వెనుక నుంచి బైక్‌పై వెళ్తున్న కరణం నవీన్ అలియాస్ సిద్దు (22) బలంగా ఢీకొట్టి అక్కడికక్కడే మృతి చెందాడు. సిద్దు సొంతూరు అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కరణం కొత్తూరు. బుధవారం అతడు విజయవాడ నుంచి స్వగ్రామానికి వెళ్లే క్రమంలో ఈ ప్రమాదం జరిగింది. విషయం తెలుసుకున్న హైవే మొబైల్ సిబ్బంది పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ శివనాగబాబు వచ్చారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు.

గౌతమి, గరీబ్‌రథ్ రైళ్లు రద్దు



రాయనపాడు వద్ద ముంపులో ట్రాక్

సామర్లకోట, సెప్టెంబరు 4: భారీ వర్షాల కారణంగా సామర్లకోట మీదుగా విశాఖ, విజయవాడలకు రాకపోకలు సాగించే పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు మూడో రోజైన బుధవారం కూడా రద్దయ్యాయి. ఈ కారణంగా ప్రయాణికులు లేక సామర్లకోట రైల్వే స్టేషన్ నిర్మానుష్యంగా మారింది. బుధవారం రద్దయిన వాటిలో కాకినాడ నుంచి లింగంపల్లి వెళ్లే గౌతమి ఎక్స్‌ప్రెస్, గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్, హౌరా నుంచి చెన్నై వెళ్లే ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్-విశాఖ మధ్య నడిచే 2740 నంబరు గల ఎక్స్‌ప్రెస్, విశాఖ-సికింద్రాబాద్ మధ్య నడిచే 12739 నంబరు గల ఎక్స్‌ప్రెస్ ఉన్నాయి.

హైద్రాబాద్-విశాఖ (12728), మహబూబ్‌నగర్-విశాఖ (12862), ఎల్టీటీ-విశాఖ (18520)... ఈ మూడింటినీ పగిడిపల్లి, గుంటూరు, విజయవాడ మీదుగా మళ్లించినట్టు సామర్లకోట రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ ఎం.రమేష్ తెలిపారు. విజయవాడ సమీపాన రాయనపాడు వద్ద రైల్వే ట్రాక్ బుధవారం సాయంత్రానికి కూడా నీటి ముంపులో ఉన్నందున ఈ మార్పులు కొనసాగిస్తున్నట్టు రైల్వే అధికారులు చెప్పారు.

ఏజెన్సీ సమాచారం



వీఆర్ పురం మండలంలో వరద పరిస్థితిని సమీక్షిస్తున్న పీవో అపూర్వభరత్

వరద ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు పటిష్ట చర్యలు

చింతూరు, సెప్టెంబరు 4: అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు డివిజన్లో వరద ప్రభావంతో ప్రజలు మరోమారు అవస్థలు ఎదుర్కొంటున్నారు. దీంతో కలెక్టర్ దినేష్‌కుమార్ వరద ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనే దిశగా పటిష్ట చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా చింతూరు డివిజన్‌లోని ఒక్కో మండలానికి ఒక్కో ఐఏఎస్ అధికారికి తాత్కాలిక బాధ్యతలు అప్పగించారు. చింతూరు మండలానికి ఐటీడీఏ పీవో అపూర్వభరత్, వరరామచంద్రపురం మండలానికి కల్పశ్రీ, కూనవరం మండలానికి ఎస్.ప్రశాంత్‌కుమార్, ఎటపాక మండలానికి డాక్టర్ అభిషేక్ గౌడ్‌లను నియమించారు. చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్ తెలిపిన వివరాల ప్రకారం బుధవారం సాయంత్రానికి వర రామచంద్రపురం మండలంలో ఐదు, కూనవరం మండలంలో ఒకటి, చింతూరు మండలంలో రెండు, ఎటపాక మండలంలో గ్రామానికి చెందిన ప్రధాన రహదాలు నీట మునిగాయి. వాటి పరిధిలోని గ్రామాలకు కూడా రాకపోకలు నిలిచిపోయాయి. వరద ప్రభా విత గ్రామాలకు తాత్కాలికంగా విద్యుత్ సరఫరా నిలిపివేయాల్సిన పరిస్థితి నెలకొంది. అత్యవసరంగా సహాయ సహకారాలు అందించేందుకు ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధం చేశారు. డీజిల్‌తో పాటు నాటు పడవలను అందుబాటులో ఉంచారు. 48 మంది గర్భిణులతో పాటు దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను సమీప ఆసుపత్రులకు తరలించారు. దోమతెరలు, క్లోరిన్ మాత్రలు సరఫరా చేస్తామని.. రేషన్, కూరగాయలు, కిరోసిన్ తదితర నిత్యావసరాలను బాధిత కుటుంబాలకు పంపిణీ చేస్తామని పీవో చెప్పారు.

వరద ప్రభావిత గ్రామాల్లో పీవో, సబ్ కలెక్టర్ పర్యటన

వర రామచంద్రపురం: మండలంలోని శ్రీరామగిరి, సీతంపేట, కన్నాయిగూడెం, చింతరేవుపల్లి, తుష్టివారిగూడెం, వెంకన్నగూడెం, రామవరం, రామవరంపాడు, జీడిగుప్ప గ్రామాల ప్రధాన రహదారులపైకి గోదావరి వరద నీరు చేరడంతో 28 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఈ గ్రామాల్లో చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్, రంపచోడవరం సబ్ కలెక్టర్ (గోదావరి వరదల ప్రత్యేక అధికారి) కల్పశ్రీ బుధవారం పర్యటించారు. అక్కడి ప్రజలతో మాట్లాడి శబరి, గోదావరి వరదల పరిస్థితిని వివరించారు. భద్రాచలం వద్ద గోదావరి వరద పెరుగుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. తాగునీరు, వైద్యం, ఆహారం అందించేందుకు ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. బాధితులకు ధైర్యం చెప్పారు. అయినా మాకీ కష్టాలు ఇంకెన్నాళ్లని వారు ఆవేదన చెందారు. పర్యటనలో తహసీల్దారు సుబ్బారావు, ఎంపీడీవో ఫణీంద్ర, ఎటపాక సీఐ, రేఖపల్లి వైద్యులు, జడ్పీటీసీ వాళ్ళ రంగారెడ్డి, టీడీపీ నాయకుడు బొర్ర నరేష్‌కుమార్, ఎంపీటీసీ కిరణ్ పాల్గొన్నారు.



ఇందుకూరుపేట సమీపంలో పొంగి ప్రవహిస్తున్న ఇనుకొండ వాగు

పొంగిన వాగులు.. స్తంభించిన జనజీవనం

దేవీపట్నం, సెప్టెంబరు 4: అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని ఇనుకొండ, సీతపల్లి, వెలగలపల్లి వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. బుధవారం మధ్యాహ్నం ఎడతెరిపి లేకుండా కురుసిన వర్షంతో ఇందుకూరుపేట సమీపంలోని ఇనుకొండ వాగు ఉప్పొంగింది. దీంతో 20 గ్రామాల ప్రజల రాకపోకలకు అంతరాయమేర్పడింది. అధికారులు వాగు వద్ద ఉండి ప్రజలు వాగు దాటకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

వీరాయిగూడెం-నెల్లిపాక మధ్య రాకపోకలు బంద్

ఎటపాక: భద్రాచలం వద్ద బుధవారం మొదటి ప్రమాద హెచ్చరికను అధికారులు జారీ చేశారు. మండలంలోని వీరాయిగూడెం-నెల్లిపాక గ్రామాల ప్రధాన రహదారిపై వరద నీరు చేరడంతో బుధవారం మధ్యాహ్నం నుంచి రాకపోకలు నిలిచాయి. మురుమూరు వద్ద భద్రాచలం-కూనవరం ప్రధాన రహదారిని ఇరువైపులా వరద నీరు చుట్టుముట్టింది.

ఉధృతంగా శబరి, గోదావరి

కూనవరం: కూనవరంలో గోదావరి 37 అడుగుల వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక దాటి ప్రవహిస్తోంది. మండలంలోని ఉదయ్‌భాస్కర్‌కాలనీ, గిన్నెల బజారు, శబరికొత్తగూడెం గ్రామాల ప్రజలు మెరక ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. తహసీల్దారు కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ఐటీడీఏ పీవో, ఏఎస్పీ మండల అధికారులను అప్రమత్తం చేశారు.

పొంగిన వాగులు.. గిరిజనుల రాకపోకలకు ఇక్కట్లు

వై.రామవరం: మండలంలో ఐదారు రోజులుగా కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లోని వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. బండిగడ్డ, సింగవరం గ్రామాల మధ్య వాగు ఉధృతంగా ఉండడంతో గిరిజనులు ఎటూ వెళ్లలేకపోతున్నారు. పలు గ్రామాల ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. రహదారులు ఛిద్రమై మరిన్ని పాట్లు పడుతున్నారు.



చింతూరు: గోదావరి, శబరి నదులు క్రమంగా పెరగుతున్నాయి. బుధవారం సాయంత్రానికి భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 44.20 అడుగులు, చింతూరు వద్ద శబరి నీటిమట్టం 27 అడుగులు వుంది. దీంతో చింతూరు, వర రామచంద్రపురం మండలాల నడుమ సోకిలేరు వాగుపై వరద నీరు చేరి రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ప్రజలు నాటుపడవపై వాగు దాటారు. చింతూరులో వారాంతపు సంత నామమాత్రంగా నడచింది.

వాగులు దాటవద్దు: ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా

చింతూరు, సెప్టెంబరు 4: వాగులు, వంకలు ప్రమాదభరితంగా ప్రవహిస్తున్నాయని, వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ దాటవద్దని అల్లూరి సీతారామరాజు జిల్లా ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా పేర్కొన్నారు. బుధవారం ఆయన చింతూరు మండలంలోని శబరి, సోకిలేరు, వర రామచంద్రపురం మండలంలోని అన్నవరం వాగు, చింతరేవుపల్లి సమీపంలోని కన్నాయిగూడెం వాగు, ఇప్పూరు వాగులను పరిశీలించారు. విలీన మండలాల పోలీసులు వరద బాధితులకు సహకారం అందించాలని ఆదేశించారు. పర్యటనలో చింతూరు సీఐ దుర్గాప్రసాద్, ఎటపాక సీఐ కన్నమరాజు, చింతూరు ఎస్ఐ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

భూపతిపాలెం ప్రధాన కాలువ ఉధృతికి గిరిజనుడి మృతి

రంపచోడవరం, సెప్టెంబరు 4: భూపతిపాలెం రిజర్వాయర్ ప్రధాన కాల్వ ఉధృతికి ఓ గిరిజనుడు బుధవారం మృతి చెందాడు. మండలంలోని చెరువుపాలెం గ్రామానికి చెందిన చెదల సత్యనారాయణరెడ్డి ఆవులను మేపుకునేందుకు కాలువ దాటుతుండగా ప్రవాహ ఉధృతికి కొట్టుకుపోయాడు. అనంతరం గ్రామస్తులు మృతదేహాన్ని గుర్తించారు. దీనిపై పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి శవ పరీక్ష నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ



రాజవొమ్మంగి, సెప్టెంబరు 4: బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు తాము సూరిబాబు ఆధ్వర్యంలో రాజవొమ్మంగి, వట్టిగెడ్డ, దొనేలపాలెం, జడ్డంగి గ్రామల్లో ప్రజలకు 300 మట్టి విగ్రహాలను అరకు పార్లమెంటరీ కన్వీనర్ బీవీ భారతి పంపిణీ చేశారు. రాజవొమ్మంగి సర్పంచ్ రమణి, జనసేన మండల శాఖ అధ్యక్షుడు బొదిరెడ్డి త్రిమూర్తులు, బీజేపీ విస్తారక్ డీవీడీ ప్రసాద్ పాల్గొన్నారు.

బీసీ హాస్టల్ వెల్ఫేర్ అధికారుల సంఘం కార్యవర్గం ఎన్నిక

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 4 : బీసీ హాస్టల్ వెల్ఫేర్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షురాలిగా పి.సరోజ, ప్రధాన కార్యదర్శిగా ఎం.సత్యకుమారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం రాజమహేంద్రవరంలోని బీసీ బాలుర వసతిగృహాల సముదాయంలో ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా బీసీ వెల్ఫేర్ హెచ్ డబ్ల్యుఓల అసోసియేషన్ అధ్యక్షుడు ఎంపీడీ కృపావరం అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కోశాధికారిగా అబ్దుల్ సుకూర్, అసోసియేట్ ప్రెశిడెంట్‌గా ఆర్.చిరంజీవి, వైస్ ప్రెసిడెంట్లుగా పి.శ్రీను, పి.జయరాజ్, జాయింట్ సెక్రటరీలుగా వి.సౌజన్య, జి.ఆశావలి ఎన్నికయ్యారు. కార్యవర్గాన్ని బీసీ వెల్ఫేర్ అధికారిణి బి.శశాంక అభినందించారు.



అనపర్తి నుంచి విజయవాడకు వ్యానులను పంపిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి



రాజమహేంద్రవరం నుంచి వాటర్ బాటిళ్లను పంపిస్తున్న వైద్యులు గోరంట్ల, గురుప్రసాద్



విజయవాడ వరద బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న ఎమ్మెల్యే బత్తుల

వరద బాధితులను ఆదుకోవడం ప్రతిఒక్కరి కర్తవ్యం

• ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

• అనపర్తి నుంచి నాలుగు వాహనాల్లో ఆహార పదార్థాల తరలింపు

అనపర్తి, సెప్టెంబరు 4: వరద బీభత్సంతో అతలాకుతలమైన విజయవాడ వాసులను ఆదుకోవడం ప్రతిఒక్కరి కర్తవ్యమని స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి వారికి అవసరమైన ఆహారం మంచినీరు అందించాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. విజయవాడ వరద బాధితుల కోసం 10వేల మందికి సరిపడా ఆహార పదార్థాలు తరలిస్తున్న వ్యాన్లను అనపర్తి దేవీచౌక్ వద్ద ఆయన జెండా ఊపి వాహనాలను ప్రారంభించారు. అనపర్తి మండలం పొలమూరుకు చెందిన బుద్దవరపు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఐదు వేల మందికి సరిపడా ఆహార పదార్థాలు, బిక్కవోలు మండలం బలభద్రపురంలోని వేంకటేశ్వరస్వామి ఆలయకమిటీ ఆధ్వర్యంలో 2500 మందికి ఆహార పదార్థాలు, అనపర్తి వర్తక సంఘం అధ్యక్షుడు కొవ్వూరి వెంకటరా మారెడ్డి ఆధ్వర్యంలో 2500మందికి ఆహార పదార్థాలను తరలించారు. ఈ సందర్భంగా విజయవాడ పయనమైన వాహనాలకు ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, సత్తి దేవదానరెడ్డి, మల్లిడి శ్రీనివాసరెడ్డి, గొలుగూరి భాస్కరరెడ్డి, కొవ్వూరి పార్వతి తదితరులు పాల్గొన్నారు.

పదివేల వాటర్ బాటిళ్లను పంపించిన వైద్యులు

రాజమహేంద్రవరం సిటీ: విజయవాడ వరద బాధితుల సహాయార్థం రాజమహేంద్రవరానికి చెందిన గోరంట్ల శాంతారావు మెడికల్ సెంటర్ అధినేత డాక్టర్ రవిరామ్‌కిరణ్ గోరంట్ల ,డాక్టర్ వైఎస్ గురుప్రసాద్‌లు పదివేల వాటర్ బాటిళ్లను పంపించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎప్పుడు చూడని వరదలు విజయవాడను అతలాకుతలం చేశాయని బాధితులను ఆదుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌పీ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. లయన్స్‌క్లబ్ కొంతమూరు షణ్ముక క్లబ్ ప్రెసిడెంట్ పామర్తి నాగరాజు, క్లబ్‌మెంటార్, జోన్ చైర్మన్ లయన్ అడుసుమిల్లి బాబు ఆధ్వర్యంలో 10వేల విలువ చేసే ఆహార ప్యాకెట్లను జాయింట్ కలెక్టర్ చిన్నరాముడుకు అందించారు. ఈకార్యక్రమంలో వరదా నాగేశ్వరరావు, భాస్కరాజు, వీరరాజు, శమంతకమణి, లక్ష్మి, సాయితేజ, ప్రసాద్ పాల్గొన్నారు.



గోకవరం: బాధితులకు ఆహార పొట్లాలను పంపిణీ చేస్తున్న రామసేన సభ్యులు

విజయవాడకు ఆహారపొట్లాల తరలింపు

గోకవరం: విజయవాడ వరద బాధితులకు గోకవరం మండలంలోని వివిధ ప్రాంతాల నుంచి ఆహారం, మంచినీళ్లు, తదితర నిత్యావసర వస్తువులను దాతలు వాహనాలపై తరలించారు. బాధితుల కు గోకవరంలోని విశ్వహిందూధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు, కొత్తపల్లి ఆదర్శ ఫార్మసీ విద్యాసంస్థల అధినేత ప్రగళ్ళపాటి కనకరాజు బాసటగా నిలిచారు. కంబాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సుమారు 5వేల భోజనం పొట్లాలు, కనకరా జు ఆధ్వర్యంలో 1000 ఆహారపొట్లాలను, వాటర్ ప్యాకెట్లను బుధవారం వాహనాలపై విజయవాడకు తరలించారు.

బిక్కవోలు ఫిషర్‌మెన్ సొసైటీ ఆధ్వర్యంలో...

బిక్కవోలు: బిక్కవోలు నుంచి విజయవాడ వరద బాధితులకు బిక్కవోలు ఫిషర్‌మెన్ కో-ఆపరేటివ్ సొసైటీవారు బుధవారం ఆహార పొట్లాలు, వాటర్ బాటిళ్ల, బిస్కెట్ ప్యాకెట్లు, పాల ప్యాకెట్లు పంపించారు. అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సూచనల మేరకు వీటిని పంపుతున్నామని ఫిషర్‌మెన్ సొసైటీ సభ్యులు తెలిపారు.

వరద బాధితులకు భోజనం ప్యాకెట్లు తరలింపు

రంగంపేట: జిల్లా కలెక్టర్ పిలుపు మేరకు తూర్పుగోదావరి జిల్లా రంగంపేట ఇన్‌చార్జ్ తహశీల్దార్ టి.వి.వి.ఎస్.ఎ.శశిధర్ ఆధ్వర్యంలో కార్యాలయం సిబ్బంది, మండలంలో గల వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లు అందరూ కలిసి బుధవారం విజయవాడలోని వరద బాధితులకు 2500 భోజనం ప్యాకెట్లును తీసుకెళుతున్న వాహనానికి ఇన్‌చార్జ్ తహశీల్దార్ జెండా ఊపి పంపించారు. కార్యాలయ సిబ్బంది, విఆర్వోలు, విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

3వ రోజు వరద బాధితుల సేవలో ఎమ్మెల్యే బత్తుల

కోరుకొండ: విజయవాడ సింగ్‌నగర్‌లో చిక్కుకున్న వరద బాధితులను బుధవారం రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, తన బృందంతో ట్రాక్టర్‌లు, జేసీబీల సహాయంతో వరదలో చిక్కుకున్న బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. 4 అడుగుల నీళ్ల లోతులో ఎమ్మెల్యే స్వయంగా నడిచి వెళ్లి బాధితులకు ఆహారం, మంచినీరు, పాలు, బిస్కెట్ ప్యాకెట్లు అందజేశారు. వృద్ధులను, మహిళలను, పిల్లలను ప్రత్యేక వాహనాల్లో సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు వీరే

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 4: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ప్రతిఏటా నిర్వహించే గురుపూజోత్సవంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను ప్రదానం చేయడం సంప్రదాయంగా వస్తోంది. రాజమహేంద్రవరంలో నగర పాలకసంస్థ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికయ్యారు. ప్రధానోపాధ్యాయుల విభాగంలో శ్రీనాగరాజా నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం టీ.చక్రధర్, జాంపేట లూథరన్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎస్.మేరి పెరల్స్‌లు ఉత్తమ ఉపాధ్యాయ అవా ర్డుకు ఎంపికయ్యారు. స్కూల్ అసిస్టెంట్స్ విభాగంలో ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఎఎల్ నరసింహరావు, శ్రీనివాసరామానుజన్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఎ.సూరిబాబులు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. అదేవిధంగా ఎస్‌జీటీ విభాగంలో నగరంలో సీతంపేట పంతం సత్యనారాయణ మునిసిపల్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు బి. చైతన్యకుమార్, సెయింట్ జాన్స్ రివర్ డేట్ ఉపాధ్యాయిని టీఎస్ సరోజినిదేవి, డీఎమ్‌హెచ్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు దాసరి శివసత్యమూర్తి జిల్లా ఉత్తయ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికయ్యారు. స్థానిక వెంకటేశ్వర ఆనంకళాకేంద్రంలో గురువారం ఉదయం 10గంటలకు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల చేతుల మీదుగా అవార్డులను ఉపాధ్యాయులకు ప్రదానం చేస్తారని డిఐ దిలీప్ కుమార్ తెలిపారు.

రాజానగరానికి ఆరు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు

రాజానగరం: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఇచ్చే పురస్కారాలు ఈఏడాది రాజానగరం మండలానికి ఆరు వరించాయి. వివరాలను మండల విద్యాశాఖాధికారి-1 రామన్నదొర బుధవారం వెల్లడించారు. మండలంలోని చక్రద్వారబంధం హైస్కూల్ నుంచి ప్రధానోపాధ్యా యుడు జీవీవీఎస్ సీతారామయ్య, పుణ్యక్షేత్రం హైస్కూల్ నుంచి గణిత ఉపాధ్యాయుడు వాకాడ వెంకటరమణ, లాలాచెరువు హైస్కూల్ స్కూల్ అసిస్టెంట్ ఉందుర్తి సుబ్బారావు, పాతతుంగపాడు హైస్కూల్ స్కూల్ అసిస్టెంట్ వి.సురేష్‌బాబు, శ్రీకృష్ణపట్నం ఎంపీపీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకట దుర్గా ప్రసాదరావు, రాజానగరంలోని ఎంపీపీఎస్ నెం-1 పాఠశాల ఉపాధ్యాయుడు పడాల శైలజ దుర్గాభవాని ఈ పురస్కారాలు అందుకోనున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులుగా విజయలక్ష్మి, సత్యనారాయణ ఎంపిక

బిక్కవోలు: బిక్కవోలు మండలం నుంచి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా కొంకుదురు మెయిన్ ప్రాథమిక పాఠశాలలో పీఎస్‌హెచ్‌ఎంగా పనిచేస్తున్న వి.విజయకుమారి, బిక్కవోలు ఉన్నత పాఠశాలలో ఒకేషనల్ టీచర్‌గా పనిచేస్తున్న పి.సత్యనారాయణ ఎంపికైనట్లు మండల విద్యాశాఖాధికారి సీహెచ్‌వీవీ సత్యనారాయణ బుధవారం తెలిపారు. ఎంపికైన వారు రాజమహేంద్రవరంలో గురువారం జరిగే గురుపూజోత్సవంలో జిల్లా కలెక్టర్ నుంచి అవార్డులు తీసుకుంటారన్నారు. ఎంపికైన ఉత్తమ ఉపాధ్యాయులను మండల ఎస్‌టీయూ, యూటీఎఫ్ శాఖ నేతలు, అభినందించారు.

రంగంపేట: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రంగంపేట మండలం నుంచి ఇద్దరు ఉపాధ్యాయులు ఎంపికయ్యారని ఎంఈవో కె.శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ గోవిందరాజాపురం మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న బెల్లపు విజయలక్ష్మి, వి.కోటపాడు మండల ప్రజా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో సోషల్ ఉపాధ్యాయుడుగా పని చేస్తున్న సీహెచ్ విజయరత్నం ఎంపికయ్యారని తెలిపారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ప్రసాద్, సత్యనారాయణ

కడియం: కడియపులంక జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్-స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న జోళ్ల సత్యసాయి విజయప్రసాద్‌కు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డుకి ఎంపికయ్యారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన ప్రసాద్‌ను సర్పంచ్-ఇన్‌చార్జి పాటంశెట్టి రాంజీ, రాష్ట్ర టీడీపీ నాయకులు మార్గాని సత్యనారాయణ, పల్ల సుబ్రహ్మణ్యం, హెచ్‌ఎం కె.జయలక్ష్మి, ఉపాధ్యాయులు అభినందించారు కడియం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టిల్లపూడి సత్యనారాయణకు ఉత్తమ ప్రధానోపాధ్యాయ అవార్డుకు ఎంపికైనట్లు డీఈవో వాసుదేవరావు తెలిపారు. ఉత్తమ ప్రధానోపాధ్యాయ అవార్డుకు ఎంపికైన సత్యనారాయణను ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, గిరజాల బాబు, సర్పంచ్ మోసిగంటి సత్యవతి, ఉపసర్పంచ్ వెలుగుబంటి నాని, ఎస్ఎంసీ సభ్యులు, ఎంఈవోలు, ఉపాధ్యాయులు అభినందించారు. అలాగే దామిరెడ్డిపల్లి నెంబర్-2 పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు సబ్బితి శ్రీనివాస్ ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డుకు ఎంపికైనట్లు డీఈవో తెలిపారు.

అనపర్తి మండలంలో ముగ్గురికి అవార్డులు

అనపర్తి: రాష్ట్ర ప్రభుత్వం అందించే జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు అనపర్తి మండలం నుంచి ముగ్గురు ఉపాధ్యాయులు ఎంపికైనట్లు ఎంఈవో నల్లమిల్లి సత్తిరెడ్డి తెలిపారు. అనపర్తి మండలం రామవరంలోని నల్లమిల్లి మూలారెడ్డి జిల్లా పరి షత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు నాగార్జున, అనపర్తి ప్రాథమి కోన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు అనూరాధ, పొలమూరు జిల్లా పరిషత్ హైస్కూల్ ఉపాధ్యాయురాలు విజయదుర్గలు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. వీరిని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మండలంలోని పలువురు ఉపాధ్యాయులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు అభినందించారు.

కోరుకొండ మండలం నుంచి ఐదుగురికి అవార్డులు

కోరుకొండ: కోరుకొండ మండలంలో పని చేస్తున్న ఐదుగురికి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు లభించాయి. వీరిలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులుగా పని చేస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్ లాంగ్వేజ్ పండిట్‌లుగా పని చేస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులు, ఒకరు హైస్కూల్ గెజిటెట్ హైస్కూల్ ఉపాధ్యాయులు ఉన్నారు. వీరిలో ఎస్జీటీ విభాగంలో కోరుకొండ మండలం కాపవరం ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న వి.కృపావతి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. మధురపూడి ప్రాథమిక పాఠశాలలో ఆర్.నాగేశ్వరరావులు ఈ అవార్డుకు ఎంపికయ్యారు. హెడ్‌మాస్టర్స్ విభాగంలో కోటికేశరం జడ్పీ హైస్కూల్‌లో గెజిటెట్ హెచ్‌ఎంగా పని చేస్తున్న కేవీ సత్యనారాయణ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. ఎస్ఏ విభాగంలో కోరుకొండ మండలం గుమ్ములూరు జడ్పీ హైస్కూల్‌లో హిందీ పండిట్‌గా పనిచేస్తున్న ఆర్. హేమంత్‌కుమార్, కోటికేశవరం జడ్పీ హైస్కూల్‌లో ఎస్ఏ ఇంగ్లీషు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న బి. సమాధానంలు ఉన్నారని జిల్లా విద్యాశాఖాధికారి కంది వాసుదేవరావు, మండల విద్యాశాఖాధికారి టికుశలవదొరలు తెలిపారు.

మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు

కోరుకొండ మండలంలో పనిచేస్తున్న సుమారు 300 మంది ఉపాధ్యాయుల్లో ఏడుగురు ఉపాధ్యాయులకు మండలస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయఅవార్డులు లభించాయి. వీరిలో గాదరాడ స్కూల్ కాంప్లెక్స్ నుంచి రాజవరం ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీ డీవీఏ ధనలక్ష్మి, గాదరాడ వీరభద్రపురం, ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీ ఎంటీఎస్‌గా పని చేస్తున్న పులైపు గంగరాజు కాపు, కోరుకొండ స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో మునగాల యూపీ పాఠశాలలో ఎస్జీటీగా పనిచేస్తున్న డి.ఉషారాణి, శ్రీరంగపట్నం స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని శ్రీరంగపట్నం శివాలయం ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీగా పనిచేస్తున్న ఎం.వరలక్ష్మి, రాఘవాపురం ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీ గా పనిచేస్తున్న ఎ.షకీనా, గాడాల స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో గాడాల జడ్పీ హైస్కూల్‌లో పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్‌గా పనిచేస్తున్న కె. మంగాదేవి(పీటీఐ), కోరుకొండ ఎంఆర్సీలో సీఆర్పీగా పని చేస్తున్న సీహెచ్ వెంకటేశ్వరరావులు మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ, ఉత్తమ సీఆర్పీ, ఉత్తమ ఇన్‌స్ట్రక్టర్‌లుగా ఎంపికైనట్లు మండల విద్యాశాఖాధికారి టి. కుశలవ దొర బుధవారం ఒక అధికార ప్రకటనలో తెలిపారు.

ముంపుప్రాంతాల పర్యవేక్షణకు మూడు ప్రత్యేక బృందాలు

• కార్పొరేషన్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు

• కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు4 : రాజమహేంద్రవరంలో ముంపు ప్రాంతాలను పర్యవేక్షించి ప్రజలకు అత్యవసర సేవల కోసం సత్వర ప్రతిస్పందన బృందాలు మూడింటిని ఏర్పాటు చేశామని కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. బుధవారం సాయంత్రం అధికారుతో కమిషనర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. నగరంలో ముంపు ప్రాంతాల ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అవసరమైతే వారిని పునరావాస కేంద్రాలకు తరలించి ఆదుకోవడానికి అన్నిచర్యలు తీసుకున్నామన్నారు. ఏడతెరపిలేకుండా కురుస్తున్న వానల వలన నగరంలో తుమ్మలోవ, ఆర్యాపురం, కృష్ణనగర్, రాజీవ్‌నగర్ పాకలు ఇంది రా సత్యనగర్ పుంత తదితర ప్రాంతాల ముంపునకు గురయ్యే అవకాశాలు ఉన్నందున అక్కడ ప్రజానీకానికి ఎటువంటి ఇబ్బందులకు గురికాకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. నగరంలో చందాసత్రం, ఆల్‌కట్ గార్డెన్స్ కళ్యాణమండపం, అంబే ద్కర్ కమ్యూనిటీహాలును పునరావాసానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. సచివాలయ కార్యదర్శులకు ఘాట్ వద్ద పర్యవేక్షించే విధులను అప్పగించామన్నారు. గతంలో సహాయ పునరావాసాలకు నగరపాలక సంస్థ సిబ్బందితో బృందాలను ఏర్పాటు చేసినట్లు వారందరూ తక్షణమే వారికి కేటాయించిన ప్రదేశాలలో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. ప్రధాన మంచినీటి సరఫరా కేంద్రంలోను , ఇతర పంపింగ్ కేంద్రాలకు ఇందనం, అదనపు మోటార్లు అన్నీ సిద్ధం చేయాలని, వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ అవసరమైనచోట్ల అదనపు మోటార్లను పంపింగ్‌కు వినియోగించాలన్నారు. సత్వర పర్యవేక్షణ బృందాలలో కార్పొరేషన్ సహాయ ఇంజనీర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో టీమ్‌లు ఏర్పాటు చేసామని తెలిపారు. కమాండ్ కంట్రోల్ రూమ్ నెం 9494060060కు తమ సమస్యలను తెలియజేయాలని తమ సిబ్బంది వెంటనే స్పందిస్తారని తెలిపారు.

రెండు పునరావాస కేంద్రాలకు 228 మంది తరలింపు

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 4: గోదావరి వరదల నేపథ్యంలో రాజమహేంద్రవరంలో ఏర్పాటు చేసిన రెండు పునరావాస కేంద్రాలకు 228 మంది మత్స్యకారులను అధికారులు తరలించారు.కలెక్టర్ ఆదేశాల మేరకు బ్రిడ్జి లంక, కేదారివారి లంక, వెదురు లంకలకు చెందిన మత్స్యకారులను పునరావాస కేంద్రాలకు తరలించినట్లు కలెక్టర్ ప్రశాంతి తెలిపారు.

నాలుగు కిలోల గంజాయితో ఇద్దరు వ్యక్తుల అరెస్ట్

గోకవరం, సెప్టెంబరు4: నాలుగు కేజీల గంజాయితో ఇద్దరు వ్యక్తులను బుధవారం అరెస్ట్ చేసినట్లు గోకవరం ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం...రంపచోడవరం నుంచి గోకవరం వైపు గంజాయి తరలిస్తున్నట్లు తనకు అందిన సమాచారం మేరకు గ్రామ శివారున ఉన్న ఐఓసీఎల్ పెట్రోల్ బంకు ఎదురుగా వాహనాలను తనఖీ చేస్తున్నామన్నారు. ఈక్రమంలో పల్సర్ మోటారుసైకిల్‌పై గంజాయితరలిస్తున్న గోకవరంనకు చెందిన ముసుగు శివ, పంజా భద్రరావు అనే ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని, వారినుంచి 4కేజీల గం జాయిని, మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ఇద్దరినీ విచారించగా మరో ముగ్గురు వ్యక్తులు మరో నాల్గు కేజీల గంజాయితో పోలీ సులను చూసి పరారైనట్లు తేలిందన్నారు. అరెస్ట్ చేసిన ఇద్దరినీ రిమాండ్ నిమిత్తం రాజమహేంద్రవరం కోర్టుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ల తనిఖీ

కడియం, సెప్టెంబరు 4: కడియం హెల్త్‌వెల్‌నెస్ సెంటర్-1 ను హెల్త్ వెల్‌నెస్‌సెంటర్-3లను బుధవారం జిల్లా ఎయిడ్స్ లెప్రసీ కంట్రోల్ అధికారి డాక్టర్ ఎస్.వసుంధర తనిఖీ చేశారు. ఈ హెల్త్ వెల్‌నెస్ సెంటర్ పరిధిలో ఉన్న టీబీ, లెప్రసీ కేసులు, రోగులకు అందుతున్న సేవలను గూర్చి సిబ్బందిని అడిగారు. టీబీ వ్యాధి గ్రస్థులకు అందించాల్సిన వైద్యం గురించి సిబ్బందికి సూచించారు అనుమానస్పద లెప్రసీ కేసులు గుర్తించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీబీ ప్రోగ్రాం సూపర్‌వైజర్ సుందరి, కడియం టీబీ యూనిట్ సూపర్‌వైజర్ శేషు, విల్సన్‌పాల్, ఎంఎల్‌హెచ్‌పీలు వినీల, శాంతిప్రియ, ఏఎన్ఎం లు బి సునీత, వి సునీత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలంతా ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి : వైద్యురాలు ఏంజెల్

రాజానగరం, సెప్టెంబరు 4: ప్రస్తుతం సీజనల్ వ్యాధులు సంక్రమించే అవకాశం ఉన్నందున ప్రజలంతా ఆరోగ్య జాగ్రత్తలు పాటిస్తే అనారోగ్యం భారి నుంచి కాపాడుకోవచ్చని రాజానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఉదయ ఏజెంల్ సూచించారు. మండలంలోని ముక్కినాడపాకలులో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఎన్‌వీవీ రమణ, ఏఎన్ఎం జీవన్ జ్యోతి, ఆశ పాల్గొన్నారు.

కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు...

రాజానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స శిబిరం నిర్వహించినట్లు పీహెచ్‌సీ వైద్యాధికా రులు డాక్టర్ గట్టి రామభాస్కర్, డాక్టర్ సీహెచ్ వెంకటలక్ష్మి తెలిపారు. దీనిలో భాగంగా తమ పీహెచ్‌సీలో ఐదుగురికి ట్యూబెక్టమీ ఆపరేషన్లు నిర్వహించామన్నారు.


వైరల్ జ్వరాలపట్ల అప్రమత్తంగా ఉండాలి: డాక్టర్ సుమతీదేవి

అనపర్తి, సెప్టెంబరు 4 : ప్రస్తుతం విస్తరిస్తున్న వైరల్ జ్వరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రామవరం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ సుమతీదేవి అన్నారు. బుధవారం అనపర్తిలోని రజక కళ్యాణ మండపంలో నిర్వహించిన వైద్యశిబిరంలో రోగులకు బీపీ, షుగర్ పరీ క్షలతో పాటు మలేరియా, డెంగ్యూ పరీక్షలు నిర్వహించారు. అవసర మైన రోగులకు మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో సుమారు 100మందికి పైగా పరీక్షలు నిర్వహించినట్లు వైద్యులు తెలిపారు. ఈ శిబిరంలో డాకర్ మీనాక్షి, హెచ్‌వీ లక్ష్మి, ఎమ్‌పిహెచ్‌ఏ దివాకర్, సిహెచ్‌వో నిర్మల, ఏఎన్ఎమ్ చంద్ర, ఆశా వర్కర్లు నీలిమ, మణి, రాజకుమారి, అనూరాధ, విజయ తదితరులు సేవలందించారు.

విపత్తులను ఎదుర్కొనేందుకు అన్ని శాఖల సమన్వయం కావాలి

• ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

అనపర్తి, సెప్టెంబరు 4: రానున్న వారంరోజుల్లో వాతావరణ పరిస్థితులలో అనేక మార్పులు వచ్చే అవకాశం ఉన్నందున అధికారులు విపత్తులను ఎదుర్కొనేందుకు సన్నద్ధంకావాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం అనపర్తిలోని పంచాయతీ కార్యాలయంలో అనపర్తి, బిక్కవోలు, పెదపూడి, రంగంపేట మండలా లకు చెందిన తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఈవోపీఆర్డీలు, వైద్య అధికారులు, వ్యవసాయశాఖ అధికారులు, విద్యుత్ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వారం రోజుల్లో మరిన్ని వర్షాలు కురిసే అవకాశం ఉందని అంటు వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున ముఖ్యంగా పారిశుధ్యం, తాగు నీరు శుభ్రతపై పంచాయ తీలు దృష్టి సారించాలని అన్నారు. బిక్కవోలు, పెదపూడి మండలాలలో పంటలు దెబ్బతినే అవకాశం ఉన్నందున ఇరిగేషన్ అధికారులు, వ్యవసాయశాఖ అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. అదే విధంగా నియోజకవర్గంలోని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, అనపర్తి ఏరియా ఆసుపత్రులలో అందుబాటులో ఉన్న మందుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమీక్షలో అనపర్తి ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తాడి రామగురెడ్డి, తహసీల్దార్ అనిల్‌కుమార్, ఎంపీడీవో హిమమహేశ్వరి, ఈవోపీఆర్డీ పద్మజ, నాలుగు మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, వైద్యాధికారులు, వ్యవసాయశాఖ, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.





రాజమండ్రిలో గోదావరి ఉధృతి



రాజమండ్రి కార్పొరేషన్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి

గోదావరి వరదలు, భారీ వర్షం..
తస్మాత్ జాగ్రత్త!

ముందస్తు కార్యాచరణతో సిద్ధంగా ఉండాలి

ఆక్రమణల వల్ల ముంపు వాటిల్లితే సంబంధిత అధికారిని బాధ్యులను చేస్తా

వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పి. ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 4: గోదావరి వరదలు పెరుగుతున్నాయి. మరోపక్క భారీ వర్షాలు కురుస్తున్నాయి. అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలి.. తస్మాత్‌జాగ్రత్త! అని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి వివిధ విభాగాల అధికారులకు ఆదేశాలు జారీచేశారు. బుధవారం ఉదయం రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయం నుంచి వీడియోకాన్ఫరెన్స్‌ను కలెక్టర్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి జేసీ చిన్నరాముడు, డీఆర్వో జి.నరసింహులు, కేఆర్‌ఆర్‌సీఎస్ డీసీ ఆర్.కృష్ణనాయక్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గోదావరి వరదలు పెరుగుతున్నాయని, లంకల్లో ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. భారీవర్షాల నేపథ్యంలో ముంపుబారిన పడే ప్రాంతాల్లో చేపట్టాల్సిన జాగ్రత్తల చర్యలపై ముందస్తు కార్యాచరణతో అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. బుధవారం ఉదయం నుంచి రాజమహేంద్రవరం, రూరల్, కడియం, పెరవలి, తాళ్లపూడి మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదైందని, లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు, పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. కమాండ్ కంట్రోల్‌రూంలో సిబ్బంది అందరూ రిపోర్టు చేయాలన్నారు. ఏ ప్రాంతంలోనైనా ఆక్రమణల వల్ల ముంపు వాటిల్లిందని తెలిస్తే సంబంధిత అధికారులనే బాధ్యులుగా చేస్తానని హెచ్చరించారు. గోదావరి పరీవాహక ప్రాంతంలో అత్యధిక వర్షపాతం నమోదైందని, ధవళేశ్వరం వద్దకు భారీగా వరద నీరు చేరే అవకాశం ఉన్న దృష్ట్యా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. రాజమహేంద్రవరం ఆర్డీవో, కొవ్వూరు సబ్‌కలెక్టర్ ప్రత్యేకంగా దృష్టి పెట్టాలన్నారు. సూరంపాలెం, కొవ్వాడ, ఎర్రకాలువ, ధవళేశ్వరం బ్యారేజ్ ప్రాంతాల్లో గండ్లు పడే అవకాశం ఉన్న లోతట్టు ప్రాంతాల్లో ముందస్తు రక్షణా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పునరవాస కేంద్రాలు, ముంపుప్రాంతాలలో నిత్యావసర సరుకుల పంపిణీ ప్రణాళికలో భాగంగా ముందస్తు చర్యల కోసం ఒక నెలకు సరిపడే నిత్యావసరాలు సిద్ధం చేసుకోవడం జరిగిందన్నారు. మత్స్యకారులు వేటకు వెళ్లకుండా నిషేధం విధించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సచివాలయ సిబ్బందికి ఎటువంటి సెలవులు ఇవ్వవద్దని, 24/7 అందుబాటులో ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. ఇప్పటికే డ్రోన్ సర్వే ద్వారా గుర్తించిన ముంపు ప్రాంతాల్లో పరిస్థితులు అంచనా వేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ ఉన్నారు.

అప్రమత్తం



ధవళేశ్వరం బ్యారేజీ చెంతన..

- ఉధృతంగా పెరిగిన గోదావరి వరద
- ఇటు రాజమహేంద్రవరం, అటు కొవ్వూరు వైపు ఉగ్రరూపం
- కాటన్ బ్యారేజ్ నుంచి 7 లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి
- మరోపక్క భారీ వర్షాలు.. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం
- క్షేత్రస్థాయిలో పర్యటించిన కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే ఆదిరెడ్డి

రాజమహేంద్రవరం (ఆంధ్రజ్యోతి)/సిటీ సెప్టెంబరు 4: గోదావరికి వరద తగిలింది. ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు పడుతుండడంతో గోదావరికి వరదనీరు పెరుగుతోంది. మరోపక్క బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో జిల్లాలో భారీవర్షాలు పడుతున్నాయి. బుధవారం రాత్రి 8 గంటలకు భద్రాచలం నీటి మట్టం 44.40 అడుగులకు చేరింది. సాయంత్రం 43 అడుగులకు చేరగానే మొదటి ప్రమాద హెచ్చరిక జారీచేశారు. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి 7లక్షల 14వేల 614 క్యూసెక్కుల వరద నీటి ప్రవాహం అంబేడ్కర్ కోనసీమ జిల్లా మీదుగా సముద్రంలోకి పోతోంది. బ్యారేజీ నీటిమట్టం 9.60 అడుగులకు చేరింది. ఇది 11.75 అడుగులకు చేరినా, బ్యారేజీ నుంచి 10 లక్షల క్యూసెక్కుల డిశ్చార్జి ఉండాలి. ఈనేపథ్యంలో గురువారం మొదటి వార్నింగ్ వచ్చే అవకాశం లేకపోలేదు. ఇక జిల్లా భారీ వర్షాలు పడుతున్నాయి. మంగళ, బుధవారాల్లో రాజమహేంద్రవరం రూరల్‌లో 108 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పెరవలిలో 101, రాజమహేంద్రవరం అర్బన్‌లో 89.8, కడియంలో 88.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లా అంతటా హోరువాన కురిసింది. నల్లజర్ల మండలంలో మాత్రం కేవలం 5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలో మొత్తం 1028.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకాగా, జిల్లా సగటు వర్షపాతం 54.1 మిల్లీమీటర్లు. జిల్లాలోని మిగిలిన ప్రాంతాల వర్షపాతాలను పరిశీలిస్తే తాళ్లపూడిలో 77.6 మీమీ, గోకవరంలో 70.0 మీమీ, కొవ్వూరులో 66.8 మీమీ, నిడదవోలులో 60.6 మీమీ, ఉండ్రాజవరంలో 59.8 మీమీ, చాగల్లులో 59.6మీమీ, సీతానగరంలో 43.0మీమీ, రాజానగరంలో 40.6 మీమీ, గోపాలపురంలో 37.6 మీమీ, దేవరపల్లిలో 34.6 మీమీ, బిక్కవోలులో 25.6 మీమీ, అనపర్తిలో 24.4 మీమీ, కోరుకొండ 20.4 మీమీ, రంగంపేటలో 15.2 మీమీ.



కొవ్వూరు గోష్పాద క్షేత్రం వద్ద వరద గోదావరి దృశ్యం

ఉరకలేస్తున్న అఖండ గోదారి

కొవ్వూరు, సెప్టెంబరు 4: పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు అఖండ గోదావరికి మరోసారి వరద పోటెత్తింది. ఈ ఏడాది జూలైలో గోదావరికి వరద పోటెత్తి 12 రోజులపాటు తీర ప్రాంత ప్రజలకు కంటి మీద కునుకులేకుండా చేసింది. మళ్లీ ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న అధిక వర్షాలకు గోదావరి నది ఉప్పొంగుతోంది. దీంతో కొవ్వూరు గోష్పాదక్షేత్రం వద్ద ప్రధాన స్నానఘట్టాలను వరద ముంచెత్తింది. స్నానఘట్టాల్లో ఉన్న శివలింగాలు, దేవతామూర్తుల విగ్రహాలు పూర్తిగా నీటమునిగాయి. గోదావరికి వరద పోటెత్తుతున్నందున తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అఖండ గోదావరి కుడి ఏటిగట్టు విభాగం (ఏజీఆర్‌బీ) ఏఈ ఆర్.సునీల్‌బాబు కోరారు. ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొవడానికి వీలుగా అవసరమైన సామగ్రిని సెంట్రల్ ఫ్లడ్ స్టోర్‌లో సిద్ధం చేశామన్నారు. కొవ్వూరు మండలం సీతంపేట (విజ్జేశ్వరం) నుంచి పోలవరం వరకు 40 కిలోమీటర్ల మేర 12 మంది అవుట్ సోర్సింగ్ సిబ్బందితో ఏటిగట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని సునీల్‌బాబు తెలియజేశారు.

రాజమహేంద్రవరంలో లోతట్టు ప్రాంతాలు జలమయం

రాజమహేంద్రవరంలో బుధవారం తెల్లవారుజాము నుంచి కురుస్తున్న వర్షానికి చాలా ప్రాంతాలు జలమయం అయ్యాయి. నగరంలో హైటెక్ బస్టాండ్, కంబాలచెరువు, కోరుకొండ రోడ్డు, లలితానగర్, కృష్ణానగర్, రామచంద్రరావుపేట, వాంబే కాలనీ, ఆదెమ్మదిబ్బ, తుమ్మలోవ, ఆర్యాపురం, రైల్వేస్టేషన్ రోడ్డు, తాడితోట రోడ్డు, ఆర్‌టీసీ కాంప్లెక్స్ రోడ్డు, వీఎల్ పురం సెంటర్ తదితర ప్రాంతాల్లో వర్షపునీరు రోడ్డెక్కింది. రహదారులు కాలువలను తలపించాయి. కంబాల చెరువు పూర్తిగా నిండింది. అదేవిధంగా ఆర్యాపురంలోని ఏబీ నాగేశ్వరరావు పార్కు స్టోరేజీ ట్యాంక్ నిండుకుంది. ఇంకా వర్షాలు పెరిగితే ఆర్యాపురం నుంచి తుమ్మలోవ వరకు, అటు లింగంపేట, మూలగొయ్యిసెంటర్ వరకు, ఇటు శేషయ్య మెట్ట డ్రైన్ ఫైర్‌స్టేషన్ వరకు రహదారులు జలమయం అయ్యే ప్రమాదం ఉంది. ప్రస్తుతం నల్లా చానల్‌లో కూడా మోటార్లు పూర్తి స్థాయిలో లేవు. హైపవర్ లిఫ్ట్ మోటార్లను విజయవాడకు తరలించారు. ప్రస్తుతం సాధారణ మోటార్లతోనే నడిపిస్తుండగా, మరొక హైస్పీడ్ మోటార్‌ను రప్పిస్తున్నారు. దాన్ని అమర్చేలోపు భారీ వర్షం పడితే ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది.



ధవళేశ్వరం సాయిబాబా ఆలయ సమీపంలో ప్రాంతాన్ని కలెక్టర్ పరిశీలిస్తున్న దృశ్యం

క్షేత్ర స్థాయిలో జిల్లా కలెక్టర్ పర్యటన

రాజమహేంద్రవరం రూరల్/సిటీ, సెప్టెంబరు 4: రాజమహేంద్రవరం, రూరల్ ప్రాంతాల్లో భారీ వర్షాల నేపథ్యంలో పలు ప్రాంతాలు ముంపుబారిన పడకుండా చేపట్టే తక్షణ చర్యల్లో భాగంగా బుధవారం కలెక్టర్ పి.ప్రశాంతి క్షేత్రస్థాయిలో పర్యటించారు. ధవళేశ్వరం సాయిబాబా ఆలయం వద్ద డ్రైన్‌తోపాటు రాజమహేంద్రవరంలో పలు ప్రాంతాల్లో సమస్యలను కలెక్టర్ పరిశీలన చేశారు. ఈ సందర్భంగా అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ ఆక్రమణల తొలగింపు పనులు చేపట్టాలని, శానిటేషన్ మెరుగుపర్చాలని ఆదేశించారు. ఆక్రమణల వల్ల ఇబ్బంది ఏర్పడితే సంబంధిత అధికారులే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ముంపు నివారణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆమె వెంట ఎంపీడీవో డి.శ్రీనివాస్, డీఆర్‌డీఏ పీడీ ఎన్‌వీవీఎస్ మూర్తి, ఇన్‌చార్జి తహశీల్దార్ రమ్య పాల్గొన్నారు.



నల్లాచానల్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ నరసింహకిషోర్, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

ముంపు ప్రాంతాలను పరిశీలించిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి, ఎస్పీ నరసింహ కిషోర్



రాజమండ్రి రైల్వే స్టేషన్ రోడ్డు, ఎదురుగా ఉన్న వీధుల్లో నిలిచిన వర్షం నీరు



రాజమండ్రి అర్బన్ తహశీల్దార్ కార్యాలయంలోకి చేరిన వర్షం నీటితో పాట్లు



రామచంద్రరావుపేట సమీపంలో వర్షం నీటిలోనే వెళుతున్న ఓ దివ్యాంగుడు

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 4: రాజమహేంద్రవరంలో ముంపు ప్రాంతాలను సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, ఎస్పీ డి.నరసింహకిషోర్ పరిశీలించారు. గోదావరిలో వరద నీరు పెరగడం, మరోపక్క భారీ వర్షం కురవడంతో వారు అప్రమత్తమయ్యారు. నల్లా చానల్‌లో మోటార్ కండిషన్ పరిశీలించారు. అలాగే రాజీవ్‌గాంధీ కాలనీ, లలితానగర్, ఆర్యాపురం, తుమ్మలోవ, రామచంద్రరావుపేట ప్రాంతాలను పరిశీలించి ముంపు నివారణకు పలు సూచనలు చేశారు. గోదావరి వరదల నేపథ్యంలో లంకల్లో ఉన్న ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించే అంశంపైన చర్చించారు. పునరావాస కేంద్రాల్లో అవసరమైన ఆహారం, సదుపాయాలు కల్పించాలని, భారీ వర్షాలు ఉన్నందున తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. లిఫ్ట్ మోటార్లు కండిషన్‌లో పెట్టుకుని ఎప్పటికప్పుడు వర్షం నీటిని గోదావరిలోకి లిఫ్ట్ చేయాలని ఎమ్మెల్యే సూచించారు. రాబోయే మూడు రోజులు వర్షం కారణంగా నగరంలోని ముంపు ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. పాల ప్యాకెట్లు, కొవ్వొత్తులు, నిత్యావసరాలు, బిస్కెట్లు, అగ్గిపెట్టెలు అందుబాటులో ఉంచుకోవాలని మైక్ ద్వారా ఎమ్మెల్యే ప్రకటింపజేశారు. తాను, ప్రభుత్వాధికారులు అందుబాటులో ఉండడంతోపాటు సహాయ సహకారాలు అందిస్తామని వాసు భరోసా కల్పించారు.

వైద్య, ఆరోగ్యశాఖ ఫ్లడ్ యాక్షన్ ప్లాన్ సిద్ధం

- భారీ వర్షాలు, వరదలు, తుఫాన్లపై అప్రమత్తంగా ఉండండి
- ఎమర్జన్సీ పరిస్థితుల్లో సెలవులు ఇవ్వొద్దు
- డీఎంఅండ్‌హెచ్‌వో తక్షణ ఆదేశాలు

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 4: భారీ వర్షాలు, వరదలు, తుఫాన్లు వంటి ప్రకృతి వైపరీత్యాల నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ముందస్తు ఫ్లడ్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసింది. ఈ మేరకు బుధవారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి (డీఎంఅండ్‌హెచ్‌వో) డాక్టర్ కె.వెంకటేశ్వరరావు జిల్లాలో మెడికల్ ఆఫీసర్లకు పలు ఆదేశాలు జారీచేశారు. వరదలు, తుఫాన్లు సంభవిస్తే వాటి తీవ్రతను తగ్గించేలా, వ్యాధులు ప్రబలకుండా, మరణాలు జరగకుండా చూడాలని ఆదేశించారు. ఆయా ప్రాంతాల్లోని వైద్య బృందాలన్నీ పూర్తి అప్రమత్తంగా ఉండాలని, ఎమర్జన్సీ పరిస్థితుల్లో వైద్య, ఆరోగ్య సిబ్బంది ఎవరికీ సెలవులు ఇవ్వొద్దని ఆయన స్పష్టం చేశారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో 24/7 మెడికల్ క్యాంపులు నిర్వహించాలని, మందులు సిద్ధంగా ఉంచుకోవాలని, క్లోరినేషన్ ప్రక్రియ చేపట్టాలని ఆ సర్క్యులర్‌లో పేర్కొన్నారు. కాగా జిల్లాలో ఆరు గ్రామాల్లో ఇప్పటికే మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నామని, మెడికల్ ఆఫీసర్లకు ఇచ్చిన ఆదేశాలను అమలయ్యేలా సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని ఆయన స్పష్టంచేశారు.

కార్మిక శాఖ నుంచి ఈనెల 30వ తేదీలోపు లైసెన్సు పొందాలి

రాజమహేంద్రవరం, సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని దుకాణాలు, వాణిజ్య వ్యాపార సంస్థలు, మోటారు రవాణా వాహన యాజమాన్యాలు, భవన, ఇతర నిర్మాణ సంస్థలు, కాంట్రాక్టు లేబర్, అంతర్రాష్ట్ర కార్మికులను వినియోగించే కాంట్రాక్టర్లు, ప్రిన్సిపల్ ఎంప్లాయిర్లు కార్మిక చట్టాలను అనుసరించి ఇంటిగ్రేటెడ్ రిజిస్ట్రేషన్ చట్టం కింద రిజిస్ట్రేషను చేసుకొని ధ్రువపత్రం పొందాలని కార్మిక శాఖ అసిస్టెంటు కమిషనర్ బీఎస్ఎం వలి పేర్కొన్నారు. గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన అవగాహన కల్పించారు. అన్ని మీసేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషను, రెన్యూవల్ సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. సెప్టెంబరు 30లోపు కొత్తగా రిజిస్ట్రేషను, రెన్యూవల్ పూర్తి చేసుకోకపోతే చర్యలు ఎదుర్కోక తప్పదన్నారు.

మిర్చి ఘాటు!



- పచ్చిమిర్చి రూ.80 పైనే
- కూరగాయలదీ ఇదే పరిస్థితి
- టమోటా రైతుబజార్లలో కిలో రూ.26, బహిరంగ మార్కెట్లో రూ.60
- బహిరంగ మార్కెట్లో భారీగా పెరుగుదల
- వర్షాల ప్రభావమేనన్న వ్యాపారులు

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 4 : కూరగాయల ధరలు సామాన్యులు, మధ్యతరగతి ప్రజలను భయపెడుతున్నాయి. కేవలం వారం రోజుల్లోనే బహిరంగ మార్కెట్లో కూరగాయల ధరలు భారీగా పెరిగిపోయాయి. పెరిగాయి అనే కంటే చిల్లర వ్యాపారులు ధరలను అమాంతం పెంచేశారు అనడం సబబేమో. ఇదీ, అదీ అని లేదు అన్ని కూరగాయల ధరలు భారీగా పెరిగాయి. సాధారణంగా ధరలు ఎప్పుడూ తక్కువగా ఉండే దొండ, బెండ వంటి కూరగాయలను సైతం బహిరంగ మార్కెట్లలో కిలో రూ.60-రూ.70 చెబుతున్నారు. పావు కిలో అయితే రూ.20లకు తక్కువ ఇవ్వడంలేదు. టమాటా రూ.60పైనే ఉంది. వంకాయలు, చిక్కుళ్లు, బీరకాయలు, పచ్చిమిర్చి వంటివి కిలో రూ.80పైనే చెబుతున్నారు. ఈ ధరలు చూసి సామాన్య మధ్యతరగతి ప్రజానీకం బెంబేలెత్తిపోతున్నారు. కానీ చిత్రంగా రైతుబజార్లలో ధరలు చాలా తక్కువగా ఉండడం గమనార్హం. రైతుబజార్లలో ఒకటి, రెండు మినహా, చాలా రకాల కూరగాయలు తక్కువ రేట్లకే దొరుకుతున్నాయి. దీంతో గత రెండు రోజులుగా రైతుబజార్లకు జనం ఎగబడుతున్నారు. దొరికిన కూరగాయలను దొరికినట్టు రెండు, మూడు కిలోలు కొనుగోలుచేసి తీసుకెళుతున్నారు. మళ్లీ వర్షాలు కురుస్తాయనే వాతావరణశాఖ హెచ్చరికల సమాచారంతో కూరగాయలకు ఇబ్బంది వస్తుందనే ఆలోచన కారణంగా ప్రజలు పెద్దసంఖ్యలో వచ్చి ఎక్కువగా కొనుగోళ్లు చేస్తున్నారని చెబుతున్నారు. దీంతో బుధవారం రైతుబజార్లన్నీ కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ప్రజలు ఎగబడ్డారు.

● వర్షాల బూచి చూపించి..

జిల్లాలో కొద్దిరోజుల కిందట ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిశాయి. గోదావరికి వరద పోటెత్తింది. కూరగాయలు ఎక్కువగా సాగుచేసే సీతానగరం, కడియపులంక, రావులపాలెం, సిద్ధాంతం వంటి ప్రాంతాల్లోని లంకలు కూడా మునిగాయి. దీంతో కూరగాయల పంటలు బాగా దెబ్బతిన్నాయి. లంకల్లో కూరగాయలు సాగుచేసే వారితోపాటు రైతుబజార్లలోని రైతుల పంటలు కూడా వర్షపు దెబ్బతిన్నాయి. ఆ తర్వాత వర్షాలు తగ్గుముఖం పట్టడం, లంకల్లో నీరు లాగడంతో నెమ్మదిగా అన్ని రకాల కూరగాయల దిగుబడి పెరిగింది. బీరకాయలు, ఆనబకాయలు, బెండ, దొండ, వంకాయలు, అరటి, చిక్కుళ్లు వంటి రకాలన్నీ మార్కెట్లకు రావడం ప్రారంభమైంది. దొమ్మేరు వంకాయలు, చిక్కుళ్లు మినహా దాదాపు అన్ని రకాల కూరగాయలు కిలో రూ.50 దాటలేదు. కానీ బహిరంగ మార్కెట్లో చిత్రంగా ధరలు అమాంతం పెరిగిపోయాయి. రైతు బజార్లలో మంచి నాణ్యత కల్గిన టమోటా కిలో రూ.26కు విక్రయిస్తుంటే బహిరంగ మార్కెట్లో రూ.60 చెప్పడం విశేషం. పచ్చిమిర్చి రైతు బజార్లలో కిలో రూ.22 ఉంటే బయటి మార్కెట్లో రూ.80 చెబుతున్నారు. టమోటాలను చిత్తూరు మదనపల్లె, కర్నూలు ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటే, పచ్చిమిర్చి ఒడిశా బరంపురం నుంచి వస్తోంది. కూరగాయలు సమీప గోదావరి లంకలు, ఇతర ప్రాంతాల నుంచి వస్తుంటాయి. బహిరంగ మార్కెట్లలోని వ్యాపారులంతా ప్రధానంగా రావులపాలెం సమీపంలోని మడికి మార్కెట్, రాజమహేంద్రవరంలోని రంభ-ఊర్వశి మార్కెట్ల నుంచి టమోటా, మిర్చి, ఇతర కూరగాయలన్నింటినీ ఖరీదు చేసి ఇక్కడ అమ్ముతుంటారు. బహిరంగ మార్కెట్లలో విక్రయించే వ్యాపారులు, రైతు బజార్లలోని వ్యాపారులు ఇద్దరూ టమోటా, మిర్చిని ఒకే మార్కెట్ల నుంచి కొనుగోలు చేస్తున్నా ధరలో ఇంత భారీ వ్యత్యాసం ఎందుకు ఉందనే ప్రశ్న తలెత్తుతోంది. మళ్లీ వర్షాలు పడితే ఈ మాత్రం కూరగాయలు కూడా దొరికే పరిస్థితి ఉండదని, ధరలు భారీగా పెరుగుతాయని వ్యాపారులు వినియోగదారులతో మైండ్‌గేమ్ ఆడుతుండడం గమనార్హం.

● రైతు బజార్లలో ధరలు ఇలా..

టమోటా గ్రేడ్-1 కిలో రూ.26, గ్రేడ్-2 కిలో రూ.22 ధర ఉంది. వంకాయలు నలుపు (డిస్కో) కిలో రూ.34, తెలుపుచార రూ.30, గులాబి రూ.36, దొమ్మేరు రూ.38కు విక్రయిస్తున్నారు. బెండకాయలు రూ.34, పచ్చిమిర్చి సన్నాలు రూ.22, కాకరకాయ రూ.28, బీరకాయలు రూ.34, క్యారట్ రూ.30, బంగాళాదుంపలు రూ.32, ఆనబకాయ రూ.30, పొట్లకాయ రూ.24, అరటికాయ రూ.7, చిక్కుళ్లు రూ.86, చేమదుంపలు రూ.38, బొబ్బర్లు రూ.34.. ఇలా బుధవారం రైతుబజార్లలో ధరలు ఉన్నాయి. ప్రతి రోజూ ఇవే ధరలు కొనసాగకపోయినా మార్కెట్ రేటును బట్టి ధరల్లో కిలోకు రెండు, మూడు రూపాయలు వ్యత్యాసంతో ధరలు పెరిగే అవకాశం ఉంటుంది. కానీ బహిరంగ మార్కెట్లలో అనూహ్యంగా ధరలు మండిపోవడం సామాన్యులు, మధ్యతరగతి ప్రజల్లో ఆందోళన కల్గిస్తోంది. ఇప్పటికే గత రెండు, మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో సీతానగరం తదితర మండలాల్లో రైతుబజార్లకు చెందిన రైతులు సాగుచేసే బెండ, దొండ, బీర, వంగతోటలు పాక్షికంగా దెబ్బతిన్నట్టు చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో మళ్లీ వర్షాలు పడితే కూరగాయల పంటల సాగుపైనా, దిగుబడులపైనా తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది. జిల్లా అధికార యంత్రాంగం, మార్కెటింగ్ అధికారులు ధరలపై దృష్టిసారించాల్సి ఉంది.



కంసాలిపాలెం-మాధవరం మధ్య ఉధృతంగా ప్రవహిస్తున్న ఎర్రకాల్వ నీరు

తూర్పు - పశ్చిమగోదావరి జిల్లాలకు రాకపోకలు బంద్

నిడదవోలు, సెప్టెంబరు 4: వారంరోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు, ఎర్రకాల్వ నీరు ఉధృతంగా ప్రవహిస్తున్న కారణంగా తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మండలం కంసాలిపాలెం పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం మాధవరం మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఈ మార్గంలో ప్రతినిత్యం రైతులు విద్యార్థులు ఉద్యోగులు రాకపోకలు సాగిస్తుంటారు. నిడదవోలు మండలంలో నుంచి తాడేపల్లిగూడెంలోకి వెళ్లేందుకు ఇది దగ్గర దారికావడమే కారణం.కొద్దిరోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఎర్రకాల్వలోకి వర్షపు నీరు వచ్చి చేరడంతో రెండు జిల్లాల మధ్య రాకపోకలను పంచాయతీ అధికారులు నిలిపివేశారు. ఒక ఫ్లెక్సీని ఏర్పాటుచేశారు.

ఎన్టీఆర్ జిల్లాకు 'తూర్పు' దాతృత్వం

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 4: ఎన్టీఆర్ జిల్లా విజయవాడ, పరిసర ప్రాంతాల్లో వరద బారినపడిన ప్రజలకు తూర్పుగోదావరి జిల్లా ప్రజలు అండగా నిలుస్తున్నారు. గత మూడు రోజులుగా జిల్లా నుంచి పెద్దఎత్తున ఆహారం పదార్థాలు, బిస్కెట్ ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లను పంపించి తమ ఉదారతను చాటుకుంటున్నారు. జిల్లా పక్షాన కలెక్టర్ పి.ప్రశాంతి మూడు రోజులుగా సహాయం పంపిస్తున్నారు. బుధవారం తెల్లవారుజామున 40వేల మందికి అల్పాహారం ప్యాకెట్లు సిద్ధం చేయించి పంపించారు. వివిధ అసోసియేషన్లు, కాంట్రాక్టర్లు, కంపెనీలు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధుల దాతృత్వంతో సమకూర్చిన ఆహార పదార్థాలను ప్యాక్ చేయించి 18 వాహనాల్లో విజయవాడ తరలించారు. 40 వేల అల్పాహార ప్యాకెట్లు, లక్ష బిస్కెట్ ప్యాకెట్లు, 1,94,300 వాటర్ ప్యాకెట్లు పంపించారు. తెల్లవారుజామున 2గంటలకు సిద్ధం చేసి విజయవాడకు ఉదయం 5:15 గంటలకు చేర్చారు. అలాగే రాజమహేంద్రవరంలో ఈనెల 2,3 తేదీల్లో అల్పాహారం భోజనాలు కలిపి 2,34,013 ప్యాకెట్లు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పర్యవేణలో పంపించారు. మరోవైపు రాజమహేంద్రవరానికి చెందిన టీడీపీ రాష్ట్ర శెట్టిబలిజ సాధికార సమితి కన్వీనర్ కుడుపూడి సత్తిబాబు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మజ్జి రాంబాబులు విజయవాడ వెస్ట్ నియోజకవర్గంలో పర్యటించి 50 మంది కార్యకర్తలతో బాధితులకు ఆహారం ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లను అందిస్తున్నారు.

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

సగ్గుబియ్యంతో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రం



నిడదవోలు, సెప్టెంబరు 4: నిడదవోలుకు చెందిన విద్యార్థి కుంచాల తపస్వి రెడ్డి జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటాన్ని సగ్గుబియ్యం, గోధుమలతో తయారు చేశారు. దీనిపై ఆంధ్రజ్యోతి కుంచాల తపస్వి రెడ్డిని పలకరించగా అర కేజీ సగ్గుబియ్యం, పావుకేజీ గోధుమలు ఉపయోగించి మూడు గంటలపాటు శ్రమించి జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటాన్ని తయారు చేశానని చెప్పాడు. ఈ చిత్రాన్ని తిలకించిన ఉపాధ్యాయులు పలువురు ప్రముఖులు తపస్వి రెడ్డిని అభినందించారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు వీరే



ముంజులూరి మాణిక్యాంబ

కొవ్వూరు, సెప్టెంబరు 4: కొవ్వూరు మండలం ఐ.పంగిడి జడ్పీ హైస్కూల్‌లో ఇంగ్లీషు ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న ముంజులూరి మాణిక్యాంబ 2024 జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు. బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మంగిన శ్రీరామారావు, ఉపాధ్యాయులు మాణిక్యాంబను అభినందించారు. శ్రీరామారావు మాట్లాడుతూ గత 7 సంవత్సరాలుగా పంగిడి పాఠశాలలో పదో తరగతి ఇంగ్లీషు సబ్జెక్టులో విద్యార్థులు నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించడం మాణిక్యాంబ సాధించిన ప్రగతి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎస్‌ఎంసీ చైర్‌పర్సన్ కె.వెంకటలక్ష్మి, ఉపాధ్యాయులు అభినందించారు. కొవ్వూరు గవర్నమెంటు హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు ఆర్. పద్మశ్రీ, సంస్కృత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోవర్ధనం శ్రీనివాసమూర్తి, కొవ్వూరు మండలం కుమారదేవం ఎంపీపీ 1 పాఠశాల ఎస్‌జీటీ వర్దనపు కృపావతిలకు 2024 జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఉత్తర్వులు విడుదల చేశారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు ఏపీటీఎఫ్ అభినందనలు



సీహెచ్ నాగేంద్ర



డి.పద్మ సుజాత



పి.సుభాషిణి

తాళ్లపూడి, సెప్టెంబరు 4: తూర్పుగోదావరి జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులుగా తాళ్లపూడి మండలం నుంచి ముగ్గురు ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. పెద్దేవం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సీహెచ్ నాగేంద్ర, అన్నదేవరపేట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డి.పద్మ సుజాత, వేగేశ్వరపురం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయిని పి.సుభాషిణిలు ఎంపికయ్యారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు జిల్లా ఏపీటీఎఫ్ అధ్యక్షుడు దున్నా దుర్గారావు, కార్యదర్శి సువర్ణరాజు, తాళ్లపూడి అధ్యక్షుడు పి.రఘువీరశాస్త్రి, సభ్యులు అభినందనలు తెలిపారు.

జాతీయస్థాయికి క్రీడాకారులను తీర్చిదిద్దిన

వ్యాయామ ఉపాధ్యాయుడు రవీంద్రనాథ్



రవీంద్రనాథ్‌ను సన్మానిస్తున్న సీఎం చంద్రబాబు (ఫైల్)

దేవరపల్లి, సెప్టెంబరు 4: పల్లె నుంచి జాతీయ స్థాయికి ఎంతోమంది క్రీడాకారులను తీర్చిదిద్దిన ఘనత వ్యాయామ ఉపాధ్యాయులు, ప్రస్తుత ప్రధానోపాధ్యాయుడు పేరం రవీంద్రనాథ్. దేవరపల్లి గ్రామానికి చెందిన రవీంద్రనాద్ ఆయన రాష్ట్ర వ్యాయామ ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు పొందారు. 2024కు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు పొందారు. ఈయన ఎక్కడ వ్యాయమా ఉపాధ్యాయుడిగా ఉద్యోగ విధులు నిర్వహిస్తే అక్కడ పతకాల పంట పండేది. దేవరపల్లిలో 2015 జూలైలో పోలవరం కాల్వ చూడటానికి వచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దేవరపల్లిలో జడ్పీ హైస్కూల్‌లో హెలిప్యాడ్‌ను ఏర్పాటుచేశారు. ఆ సందర్భంగా పీడీ రవీంద్రనాద్ విద్యార్థులతో రోప్ స్కిప్పింగ్, పలు క్రీడల ప్రదర్శన చేయడంతో ముగ్ధుడైనా చంద్రబాబు నాయుడు ఆయన్ని రాష్ట్ర చాప్ డైరెక్టర్‌గా నియమించారు.రాష్ట్ర యోగా కోఆర్డినేటర్‌గా కూడా నియమించారు. ఆయన ఉద్యోగ బాధ్యతలు ప్రగడవరంలో చేపట్టారు. అనంతరం టి.నర్సాపురం, దేవరపల్లి, రామన్నపాలెంలో ప్రధానోపాధ్యాయులుగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయన శిక్షణ ఇచ్చిన క్రీడల్లో ఉద్యోగ అవకాశాలు 600మందికిపైగా వచ్చాయి. పీడీ, ఎస్సైలు, కానిస్టేబుల్స్, సీఐ, ఎస్సై, రైల్వేలోనూ, ఏఆర్ కానిస్టేబుల్స్‌గా ఉద్యోగ బాధ్యలు నిర్వహిస్తున్నారు. ఆయన ఎందరో క్రీడాకారులకు తమ జీవితాల్లో వెలుగులు నింపిన ఘనత ఆయనకే దక్కుతుంది. ఆయన ఇంట్లోకన్నా క్రీడా మైదానంలోనే ఎక్కువ గడుపుతుంటారు. ఆయన ఏ గ్రామంలో పని చేసిన విద్యార్థులతో పాటు స్థానికులతో మమేకమై ఆ పాఠశాలలో అన్నివిధాలా క్రీడా మైదానంగా తీర్చిదిద్ది జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో పాల్గొన టమే కాకుండా ఎన్నో పతకాలు సాధించడానికి ఆయన కృషి ఎంతో ఉంది. ఆయన వ్యాయమా ఉపాధ్యాయునిగా ఇప్పటి వరకు ఆయన పని చేసిన స్కూల్‌లో జాతీయస్థాయిలో ఆయన శిష్య బృందంతో 855గోల్డ్ మెడల్స్, 724 సిల్వర్ మెడల్స్, 601 బ్రాంజ్ మెడల్స్ సాధించారు. ఆయన ఎక్కువగా మెడల్స్ సాధించిన క్రీడలు ఖోఖో, కాబడ్డీ, హ్యాండ్‌బాల్, అథ్లెటిక్స్, త్రోబాల్, టెన్నీకాయిట్, చపక్‌తక్రా, రోప్‌స్కి ప్పింగ్, మహిళా క్రికెట్, యోగా పెర్ఫామెన్స్‌లో రోప్ స్కిప్పింగ్ ఫైర్‌లోనూ ఎన్నో మెడల్స్ సాధించే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దారు. ఆయన శిష్యులే వ్యాయామ ఉపాధ్యాయులుగా రామన్నపాలెం, పల్లం ట్ల, దేవరపల్లి, పలుచోట్ల జిల్లాలోనే ప్రథమంగా క్రీడాకారులుగా తీర్చిదిద్దిన ఘనత రవీంద్రనాథ్‌కే దక్కుతుంది.

ఎయిమ్స్ పీజీ పరీక్షలో

శ్వేత మాధురికి 812వ ర్యాంకు



తల్లిదండ్రులతో పుల్లా శ్వేత మాదురి

కొవ్వూరు, సెప్టెంబర్ 4: ఎయిమ్స్ పి.జి.పరీక్షల్లో కొవ్వూరు పట్టణానికి చెందిన పుల్లా శ్వేత మాధురి 812వ ర్యాంకు సాధించింది. కొవ్వూరు పట్టణానికి చెందిన పుల్లా వెంకటేశ్వరరావు, సుజాత దంపతుల కుమార్తె శ్వేత మాధురి వైజాగ్ ఆంధ్రా మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేసింది. ఎయిమ్స్ పీజీ పరీక్షల్లో 812వ ర్యాంకు సాధించి మంగళగిరి ఎయి మ్స్‌లో పీడీయాట్రిక్స్ ఎండీ సీటు సాధించింది. ఈ సందర్భంగా శ్వేతను కొవ్వూరు పట్టణానికి చెందిన పలువురు అభినందించారు.

మత్స్యకార సొసైటీ పాలకవర్గం ఎన్నిక

పెరవలి, సెప్టెంబరు 4: ఖండవల్లిలో శ్రీ భక్తాంజనే య మత్స్యకార సహకార కోఆపరేటివ్ సొసైటీ పాలకవర్గాన్ని నూతనంగా ఎన్నుకున్నారు. పాలకవర్గ అధ్యక్షుడిగా వెంకటేశ్వరరావు కార్యదర్శిగా కోపన శోభనాద్రి ఆదినారాయణ, ఉపాధ్యక్షుడిగా కోపనాతి శ్రీను, డైరెక్టర్‌లుగా కొల్లి పోసిబాబు, కొల్లి శ్రీను, ఎంఅడీ రాముడు, కర్రి సూర్యనారాయణ, కర్రి పోతురాజు, పెన్మాడి సూరిబాబులు ఎన్నికయ్యారు.

ఆలయంలో ఓంకారం, త్రిశూలం ప్రారంభం

ఉండ్రాజవరం, సెప్టెంబరు 4: మండలంలోని పాలంగి గ్రామంలో కనకదుర్గ అమ్మవారి ఆలయంవద్ద దాతల సహకారంతో ఏర్పాటు చేసిన ఓంకారం, త్రిశూలాన్ని నియోజవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు బుధవారం సాయంత్రం ప్రారంభించారు. దాతలను ఆయన అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణ, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వరద బాధితులకు బిర్యానీ ప్యాకెట్లు సరఫరా

ఉండ్రాజవరం, సెప్టెంబరు 4: ఉండ్రాజవరం తహసీల్దార్ కార్యాలయం నుంచి విజయవాడలోని వరద బాధితులకు 2,500 బిర్యానీ ప్యాకెట్లు, 5వేలు వాటర్ బాటిల్స్ పంపినట్లు తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్ బుధవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు పాల్గొన్నారు.



అన్నసమారాధన

చాగల్లు, సెప్టెంబరు 4: శ్రీకృష్ణాష్టమి వేడుకలు ముగింపు సందర్భంగా స్థానిక సెంటర్‌లోని వేణుగోపాలస్వామి వారి ఆలయంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశా రు. భక్తులు ఆలయకమిటీ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి అన్నప్రసాదం స్వీకరించారు. ఉత్సవకమిటీ సభ్యులు మద్దుల సత్యన్నారాయణ, పాశం రామక్రిష్ణ, సురేష్, వీర్ల లక్ష్మినారాయణ, రామక్రిష్ణ, వెంకట్, సుబ్బారావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

'గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి'

నల్లజర్ల, సెప్టెంబరు 4: గర్భిణులు, బాలింతలు విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని ఇన్‌చార్జీ సీడీపీవో పద్మావతి అన్నారు. పౌష్టికాహారం మాసోత్సవాల సందర్భంగా బుధవారం అనంతపల్లిలో గర్భిణులకు సీమంతాలు చేశారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ ఆరోగ్య సమాజం కావాలంటే గర్భిణులు పౌష్టికాహారంతోపాటు అన్ని రకాల పండ్లు, కూరగాయలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కృష్ణవేణి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



కొవ్వూరు: విజయవాడ కృష్ణలంక రణదీర్‌నగర్‌లో దుప్పట్లు పంపిణీచేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి



విజయవాడ వరద బాధితులకు 5000 ఫుడ్ ప్యాకెట్‌లు తరలిస్తున్న అవంతీ ఫీడ్స్ సిబ్బంది



తాళ్లపూడి: ఆహారపదార్థాల వ్యానును జెండాఊపి ప్రారంభిస్తున్న సబ్ కలెక్టరు, తహసీల్దార్

వరద బాధితులకు అండగా ప్రభుత్వం

- ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు
- మెడిసిన్, దుప్పట్లు, ఆహార పొట్లాల పంపిణీ
- వరద బాధితులకు పలువురి చేయూత

కొవ్వూరు, సెప్టెంబర్ 4 : వరద తగ్గి ప్రజలు రోజువారి పనులు చేసుకునే వరకు ప్రభుత్వం అండగా ఉంటుందని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. విజయవాడ కృష్ణలంక, రణదీర్‌నగర్‌లో వరద ముంపునకు గురైన బాధితులకు బుధ వారం ముప్పిడి వెంకటేశ్వరరావు మెడిసిన్, దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం కృష్ణలం 7వ లైన్‌లో పర్యటించి వరద బాధితులను పరామర్శించి, వారికి అవసరమైన సౌకర్యాలు ఏర్పాటుచేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రజలతో పా టు పశువులకు దాణా, ఆహారం ఏర్పాటుచేయాలన్నా రు. కనకదుర్గమ్మ చలువతో కృష్ణమ్మ శాంతించిందని విజయవాడ ప్రజలంతా సురక్షితంగా ఉన్నారన్నారు. ప్రజలు రోజువారి పనులు చేసుకునే వరకు ప్రభుత్వంతోపాటు మేము అందుబాటులో ఉండి నిరంతరం సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. ప్ర జల సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి వారికి అవసరమైన సౌకర్యాలు ఏర్పాటుచేస్తామని తెలిపారు.

కొవ్వూరు అవంతీ ఫీడ్స్ ఫుడ్ ప్యాకెట్‌ల పంపిణీ

విజయవాడ వరద ముంపు బాధితులకు కొవ్వూరు అవంతీ ఫీడ్స్ ఫుడ్ ప్యాకెట్‌లను బుధవారం తరలించారు. డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఆదేశాల మేరకు విజయవాడ అక్షయపాత్ర ఫౌండేషన్ సహకారంతో 5వేల ఫుడ్ ప్యాకెట్స్ తయారు చేయించి బాధితులకు పంపి ణీ చేశారు. కార్యక్రమంలో ఫ్యాక్టరీ ఉద్యోగులు పాల్గొన్నారు.

2500 ఆహార ప్యాకెట్లు పంపిణీ

తాళ్లపూడి : జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు తా ళ్లపూడి తహసీల్దార్ బీరా రవీంద్రనాథ్ ఆధ్వర్యంలో నలుపురి దాతల సహకారంతో 2500ల ఆహార పొట్లాలను విజయవాడ పంపించామని తెలిపారు. ఉదయం నుంచీ ఆహార పదార్థాల తయా రీ కార్యక్రమంలో నిమగ్నమైన సిబ్బందిని సబ్ కలె క్టరు అశుతోష్ శ్రీవాత్సవ అభినందించారు. డీటీ భారతి, ఏఎస్‌వో జోడాల వెంకటేశ్వరరావు, ఆర్‌ఐ కిషోర్, వీఆర్వో నాగేశ్వరరావు, సంజీవరావు, ప్రవీణ్, మాజీ సర్పంచ్ నామన పర మేశ్వరరావు, గ్రామరెవెన్యూ సహాయకులు పాల్గొన్నారు.

వరద బాధితులకు తాళ్లపూడి యువగళం టీం

విజయవాడలోని వరద బాధితులకు సహాయం అందించే కార్యక్ర మంలో తాళ్లపూడి మండల యువగళం టీం సభ్యులు పాల్గొన్నా రు. విజయవాడ వరద ముంపు ప్రాంతాలలో ఆహార పదార్థాల పంపిణీయే కాక అక్కడ ఉన్న సమస్యలపై ఆరా తీస్తూ ముంపు ప్రాంతాలలో కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పర్యటించారని 20వ డివి జన్‌లో ఎమ్మెల్యే వరద బాధిత ప్రాంతాలలో పర్యటించి అక్కడి ప్రజలకు అండగా నిలబడుతున్న తీరు అభినందనీయమని ప్రజలకు ఆహారపొట్లాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనున్నామని యువగళం టీం సభ్యులు కాకర్ల సత్యేంద్ర ఒక ప్రకటనలో తెలిపారు.

నిత్యావసర సరుకుల తరలింపు

నల్లజర్ల: నల్లజర్ల మండలం దూబచర్లకు చెందిన కామ్మెల్ గాస్పల్ మినిస్ట్రీస్ డైరెక్టర్ పిట్టా జాన్ సుకుమార్ ఆధ్వర్యంలో విజయవాడ వరద బాధితులకు నిత్యావసర సరుకులు తరలించారు. బుధవారం టీడీపీ జిల్లా కార్యదర్శి కూచిపూడి ఉదయభాస్కర్ నిత్యావసర సరుకులు 2టన్నుల బియ్యం, 1500 వాటర్ బాటిల్స్, 2వేల బిస్కెట్ ప్యాకెట్స్, దుప్పట్లు, బట్టలు పంపిణీ చేసేందుకు వ్యాన్‌లో తరలించారు. మండలంలో టీడీపీ, జనసేన కార్యకర్తలు నాయకులు విజయవాడ వరద బాధితులను ఆదుకోవాలని కూచిపూడి పిలుపునిచ్చారు. వరద బాధితులకు చేయూత నిచ్చిన పిట్టా జాన్ సుకుమార్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో పిట్టా జ్యోతి, లాజరస్, గుడే యేసురత్నం, పెనుమాక జోషఫ్,కోలారి దానయ్య పాల్గొన్నారు. అదేవిధంగా పోతవరం పద్మశాంతి ఐక్యవేదిక ద్వారా 5వేల వాటర్ ఫ్యాకెట్స్, 5వేల పులిహోర ప్యాకెట్లు వరద బాధితులకు అందజేశారు.



నల్లజర్ల: దూబచర్ల నుంచి విజయవాడ నిత్యావసర వస్తువులు తరలిస్తున్న దృశ్యం



నిడదవోలు నుంచి విజయవాడకు ఆహారాన్ని పంపిస్తున్న రెవెన్యూ ఉద్యోగులు, సిబ్బంది



పెరవలి నుంచి ఆహార పొట్లాల వ్యాన్‌ను పంపిస్తున్న తహసీల్దార్ అచ్యుత కుమారి

విజయవాడకు 2,500 ఆహార ప్యాకెట్ల తరలింపు

పెరవలి : విజయవాడలో వరద బాదితుల సహాయార్థం పెరవలి తహసీల్దార్ కార్యాలయం నుంచి ఆహార పొట్లాలు వ్యాన్‌లో పంపించారు. విజిటబుల్ బిర్యాని, పెరుగు అన్నం, సుమారు 2500 ప్యాకెట్లు తయారు చేయించి ఆయా గ్రామ వీఆర్‌వోలు, రెవిన్యూ సిబ్బంది సహకారంతో అక్కడికి తరలించినట్లు తహసీల్దార్ అచ్యుత కుమారి తెలిపారు. ఈ కార్యక్రమంలో డీటీలు కనకదుర్గ, ఆర్ఐ పావని, ఇతర రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆహార పొట్లాల తరలింపు

చాగల్లు: విజయవాడ వరద బాధితులకోసం తహసీల్దార్ ఆధ్వర్యంలో తయారుచేసిన ఆహార పొట్లాలను బుధవారం తరలించారు. వ్యానును జెండా ఊపి ప్రారంభిస్తున్న తెలుగుయువత రాష్ట్ర నాయకుడు శ్రీరామ్ జెండాఊపి ప్రారంభించారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆళ్ళ హరిబాబు, తాళ్ళూరి ప్రసాద్, పాశంరామక్రిష్ణ, తాళ్ళూరి శ్రీను, దొంగ రామక్రిష్ణ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

రెవెన్యూ శాఖ నుంచి 2500 ఫుడ్ ప్యాకెట్స్ సరఫరా

నిడదవోలు: నిడదవోలు మండల తహసీల్దార్ కార్యాలయ అధికార్లు సిబ్బంది జిల్లా కలెక్టర్ ఆదేశాలతో బుధవారం సుమారు 2500 మందికి వెజ్ బిర్యాని, పొటాటో కర్రీ ప్యాకెట్లను విజయవాడ వరద బాధితలకు ప్రత్యేక వాహనం ద్వారా పంపారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.నాగరాజు నాయక్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సత్యేంద్ర, వీఆర్వో ప్రభాకర్ పాల్గొన్నారు.

నిడదవోలు లయన్స్‌క్లబ్ రూ.50 వేలు విరాళం

నిడదవోలు పట్టణంలోని నిడదవోలు లయన్స్‌క్లబ్ విజయవాడ వరదబాధితులకు ఫ్లడ్ రిలీఫ్ ఫండ్‌గా 50 వేల రూపాయల విరాళాన్ని లయన్స్ జిల్లా గవర్నర్ కాకరాల వేణుబాబుకి పంపినట్లు లయన్స్‌క్లబ్ కార్యదర్శి బేతిన రామన్ తెలిపారు.



కొవ్వూరు విజయవిహార్ సెంటర్‌లో కురుస్తున్న వర్షం

ఎడతెరిపిలేని వాన

- లోతట్టు ప్రాంతాలు జలమయం
- ఇబ్బందులకు గురవుతున్న ప్రజలు



జలమయమయిన కొవ్వూరు లిటరరీక్లబ్ వీధి

కొవ్వూరు, సెప్టెంబర్ 4: కొవ్వూరు పట్టణ, మండలంలో ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. బుధవారం తెల్లవారుజాము నుంచి కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కొవ్వూరు పట్టణ, మండలంలో ఏకదాటిగా వర్షం కురవడంతో ప్రజలు ఇంటికే పరిమితమయ్యారు. దీంతో రహదారులన్నీ వెలవెలబోతున్నాయి. రహదారి గుంతలు, పల్లపు ప్రాంతాలలో వర్షపునీరు చేరి వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. రహదారి గుంతలలో వర్షపునీరు చేరడంతో వాహనదారులు ప్రమాదాలకుగురై గాయాల పాలవుతున్నారు. మురుగు కాలువలు పొంగి రోడ్లపై ప్రవహిస్తున్నాయి. కొవ్వూరు రైల్వేస్టేషన్ సమీపంలోని లిటరరీ క్లబ్ వీధి, నందమూరు రోడ్, ఫైర్‌స్టేషన్ ప్రాంగణం, కోర్టు, పోలీస్‌స్టేషన్‌కు వెళ్లే మార్గాలు వర్షపునీటితో నిండి కాలువలను తలపించాయి. ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పట్టణ, మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సెలవు ప్రకటించారు. కొంతమంది ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు కలెక్టర్ ఆదేశాలను లెక్కచేయకుండా పాఠశాలలను పెట్టడంతో తల్లిదండ్రులు అధికారుల చర్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాచారం తెలుసుకున్న అధికారులు తెరచివున్న పాఠశాలలకు సెలవు ప్రకటించి విద్యార్థులను ఇంటికి పంపించి వేయాలని యాజమాన్యాలను ఆదేశించారు.

వర్షంతో పెరుగుతున్న కూరగాయల ధరల

నల్లజర్ల : ఎడతెరిపి లేని వర్షంతో రైతులతోపాటు, ప్రజలు భయాందోళన చెందుతున్నారు. విజయవాడలో పరిస్థితులను చూసి ప్రజలు, రైతులు వర్షం అంటే హడలిపోతున్నారు. ఇప్పటికే వరి పంట పొట్ట దశకు రావడంతో తుఫాన్ ఏవిధంగా ఇబ్బంది పెడుతుందోనని రైతులు ఆందోళన పడుతున్నారు. విజయవాడ వరద ఉధృతికి ఇటు కూరగాయల ధరలు సైతం పెరిగిపోయాయి. మొన్నటివరకు కిలో రూ.40 ఉన్న బెండ రూ.60కి అదేబాటలో బీర రూ.60, వంగ రూ.60 గోరుచిక్కుడు రూ.60, ఆకాకర రూ.160, నాటు చిక్కుడు రూ.120 ధరలు అమాంతంగా పెరిగాయి. ఆటు నిత్యావసర వస్తువుల ధరలు సైతం ఆకాశాన్ని అంటుతున్నాయి. అధికవర్షాలవల్ల రైతులతోపాటు ప్రజలపై ఆర్థిక భారం మరింత పడనుంది. బుధవారం ఉదయం నుంచి కురుస్తున్న వర్షాలకు ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. పనులు లేక సామాన్యులు సైతం కుటుంబ పోషణకు ఇబ్బందులు కలుగుతున్నాయి.

జలమయమైన గ్రామాలు

తాళ్లపూడి: తాళ్ళపూడి మండలం వేగేశ్వరపురం గ్రామంలో వర్షాకాలం కావడం డ్రైనేజీ వ్యవస్థ సరిలేకపోవడంతో ప్రజలంతా ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నా పంచాయతీ అధికారులు మాత్రం వీటిపై దృష్టి పెట్టకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల పలు వీధులు లోతట్టు ప్రాంతాలన్నీ వర్షపు నీటికి మునిగిపోయాయి. సీజనల్ జ్వరాలు ఒకవైపు, వర్షపునీటితో మునిగిన రోడ్లు మరో వైపు ఇటువంటి పరిస్థితులలో ప్రజలంతా నానా అవస్థలు పడుతున్నా అధికారులు, నాయకులు సైతం పట్టించుకోవడంలేదని ప్రజలు వాపోతున్నారు.





నిడదవోలులో కురిసిన వర్షానికి నీట మునిగిన ఆర్టీసీ డిపో, గణపతి సెంటరు రోడ్డు

చినుకు పడితే చెరువే

- నిడదవోలులో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం
- వర్షాలతో రోడ్లు జలమయం

నిడదవోలు, సెప్టెంబరు 4: నిడదవోలు పుర పాలకం సంఘం ఏర్పడి 50 ఏళ్ల పూర్తయ్యింది. పట్టణంలో సుమారు 45 వేల మందికిపైగా జనాభా నివశిస్తున్నా చినుకుపడితే పట్టణమంతా వరద గోదారిగా మారిపోతుంది. పట్టణంలో చిన్నదో పెద్దదో డ్రైనేజీ వ్యవస్థ ఉన్నా ఆ డ్రైనేజీలకు ఔట్‌లెట్ లేకపోవడం పట్టణంలో ఎక్కడ పడితే అక్కడ డ్రైనేజీలపై ర్యాంపులు కట్టి అక్రమణలకు గురికావడం మరికొన్ని చోట్ల డ్రైనేజీలు ఒక్కసారి, రోడ్లు మరికొంత కాలం పోయాక నిర్మాణాలు చేపట్టడం వంటి వ్యత్యాసాలతో వర్షాలకు డ్రైనేజీలలో వర్షపు నీరు ఏకమై రోడ్లన్నీ కాలువలుగా మారిపోతున్నాయి. ముఖ్యంగా పట్టణం లోని పొట్టి శ్రీరాములు మెయిన్ రోడ్డు, బస్టాండ్ రోడ్డు, ఉజ్జినవారి వీధి, గణపతి సెంటరు. గణేష్‌చౌక్ సెంటర్ వంటి ప్రధాన మార్గాలు వర్షాలకు వరద గోదావరిలా నీరంతా రోడ్లపై ప్రవహిస్తోంది. పట్టణ నడిబొడ్డులో ఉన్న ఆర్టీసీ డిపో సైతం చిన్నపాటి వర్షానికే చెరువుగా మారిపోతుంది. ఏ ప్రభుత్వం వచ్చినా ఏమున్నది గర్వకారణం అధికార్ల నిర్లక్ష్యం పట్టణ ప్రజల పాలిట ప్రమాదాలకు నిలయంగా మారుతోంది. డ్రైనేజీలపై ఆక్రమణలను తొలగించి అన్ని డ్రైనేజీలకు సరైన ఔట్‌లెట్‌ను ఏర్పాటు చేస్తే సమస్య పరిష్కారం అవుతుందంటున్నారు ప్రజలు.



సాగిపాడు వద్ద కొవ్వాడ కాల్వ కాజ్వేను పరిశీలిస్తున్న సహాయ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ్

కాజ్‌వేపై రాకపోకలు నిలిపివేయండి

- సహాయ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ

గోపాలపురం, సెప్టెంబరు 4: తుఫాన్ ప్రభావంతో గత వారంరోజులుగా కురుస్తున్న వర్షాలకు దొండపూడి, సాగిపాడు గ్రామాల మధ్య ఉన్న కొవ్వాడ కాల్వ కాజ్‌వేపై రాకపోకలు నిలిపివేయాలని సహాయ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ్ డిప్యూటీ తహసీల్దార్ కే.ప్రదీప్‌ను ఆదేశించారు. కాజ్‌వేపై వరదనీటి ప్రవాహాన్ని ఆయన బుధవారం రెవెన్యూ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న వాతావరణ పరిస్థితుల్లో ముందస్తు చర్యల్లో భాగంగా కొవ్వాడ కాల్వ ప్రవాహ ంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా దొండపూడి, సాగిపాడు గ్రామాల మధ్య ఉన్న కాజ్‌వేపై రాకపోకలు నిలిపి వేయాల్సింది గా ఆదేశాలు జారీ చేశామన్నారు. పంచాయతీ, రెవెన్యూ, పోలీస్‌శాఖల సమన్వయంతో 24గంటలు కాజ్‌వేపై నిఘా ఉంచాలన్నారు. ఎప్పటికప్పుడు అక్కడి పరిస్థితులు స్వయంగా తనకు తెలియజేయాలన్నారు. ఆయన వెంట దొండపూడి గ్రామకమిటీ అధ్యక్షుడు రాయుడు, జయశివ సూర్యం ఉన్నారు.

గోదావరి పరవళ్లు



పెరవలి, సెప్టెంబరు 4 : గోదావరి ఎగువ భాగంలో కురుస్తున్న వర్షాలతో గోదావరి వరద క్రమేపీ పెరుగుతోంది. పది రోజుల క్రితంవరకు అంతంత మాత్రంగా ఉన్న గోదావరి మంగళ, బుధవారాల్లో ఉధృతంగా ప్రవహిస్తోంది. బుధవారం సాయంత్రానికి పల్లపు లంకభూముల్లోకి నీరు ప్రవేశించింది. ఇది మరింత ఉధృతమై గురువారం నాటికి వరద మరింత పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు.

ఉధృతంగా కొవ్వాడ కాలువ



వెంకటాయాపాలెం శివారులో ఉధృతంగా ప్రవహిస్తున్న కొవ్వాడ కాలువ

గోపాలపురం, సెప్టెంబరు 4: బంగాళఖాతంలో ఏర్పడి న అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు చిట్యా ల, వెంకటాయపాలెం సమీ పంలో కొవ్వాడ కాల్వకు వరదనీరు పోటెత్తి ఉధృతం గా ప్రవహిస్తోంది. వరదనీటి ప్రవాహం పోటెత్తడంతో కాల్వకు ఇరుపక్కల ఉన్న వరిచేలకు నీరు పోటెత్తింది. ఎగువ ప్రాంతంలో భారీగా వరదనీరు ప్రవహిస్తే మరోసారి వరి పొలాలు ముంపునకు గురవుతాయని రైతులు వాపోతున్నారు.

పీఎం సూర్యఘర్ యోజనతో విద్యుత్ బిల్లు ఆదా చేసుకోండి

- ఏఈ వెంకట్రావు

తాళ్లపూడి, సెప్టెంబరు 4 : ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన పథకం ద్వారా సోలార్ రేఫ్‌టాప్‌ను ఎంపిక చేసుకుని విద్యుత్ బిల్లును ఆదా చేసుకోవాలని ట్రాన్స్కో ఏఈ వెంకట్రావు ఓ ప్రకటనలో తెలిపారు. గృహ వినియోగదారులకు ఇది మంచి అవకాశమని రూ.1000పైబడి బిల్లు కట్టే ప్రతిఒక్కరూ దీనికి అర్హులేనని ఈ పథకం ద్వారా సోలార్ కనెక్షన్ పొందే వారికి సబ్సిడీ లభిస్తోందని వివరాలకు మండలంలోని ట్రాన్స్కో ఏఈనిగానీ, సిబ్బందినిగానీ, స్థానిక లైన్‌మేన్‌ని సంప్రదించాలని కోరారు.

'సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి'

తాళ్ళపూడి, సెప్టెంబరు 4: సైబర్ నేరాలపట్ల ప్రజలు అప్ర మత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు చేస్తున్నా అమాయక ప్రజలు వారికి బలవుతు న్నారన్నా రు. తాళ్ళపూడి ఐకేపీలో పనిచేస్తున్న నాగదేవి బుధవారం తన పైఅధికారులు వివరాలు అడిగారని భావించి ఫోన్‌లో వచ్చిన ఓ లింక్‌ను ఓపెన్‌చేసి వివ రాలు అప్‌లోడ్ చేశారు. మరుక్షణం బ్యాంక్ ఖాతాలోని డబ్బులు మాయం అయ్యాయి. ఆమెతో వాట్సాప్‌లో ఉన్న వారికి ఆ లింక్ షేర్ అయ్యింది. తనకి జరిగిన మోసాన్ని గుర్తించి అందరికీ ఫోన్ ద్వారా ఆలింక్ ఓపెన్ చేయొద్దని హెచ్చరించి పోలీసులకు ఫిర్యా దు చేశారు. ఇటువంటి లింక్‌ల విషయంలో బ్యాంక్ ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలని తాళ్ళపూడి ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు.